honeybee.org
Vol-9 Issue-6
సంపుటి 9 సంచిక 6 సెప్టెంబర్ - అక్టోబర్ 2021

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక







# ఎక్కడ కొట్టాలో తెలిసి ఉండాలి !



ఒకసారి పెద్ద ఓడ ఇంజను అకస్మాత్తుగా ఆగిపోయింది. ఓడ యజమానులు, ఎంతోమంది నిపుణులను పిలిపించారు కానీ ఎవ్వరూ దీనిని ఏవిధంగా తిరిగి పని చేసేలా చెయ్యాలో కనుగొనలేక పోయారు. చివరికి తాను యువకునిగా ఉన్నప్పటి నుంచీ ఓడలు బాగు చేస్తున్న ఒక పెద్దాయనని తీసుకొని వచ్చారు. ఆయన తనతో ఒక పెద్ద సంచినిండా పనిముట్లతో వచ్చి పని మొదలు పెట్టాడు.

ఆ పెద్దాయన ఓడ ఇంజన్‌ని సునిశితంగా పరీక్షించసాగాడు. ఓడ యజమానులు చాలా ఆతృతగా ఇప్పటికైనా ఏం చెయ్యాలో తెలిపి తిరిగి ఓడ నడిచేలా చేస్తే బాగుండునని చూస్తున్నారు.

చాలాసేపు ఇంజన్‌ని పరిశీలించిన తరువాత ఆ పెద్దాయన తన పెద్ద సామాను సంచిలోనుంచి ఒక చిన్న సుత్తె తీశాడు. దానితో ఇంజన్ లోని ఒక భాగంపై సున్నితంగా ఒక్క దెబ్బ వేశాడు. అంతే ఇంజను పని చెయ్యటం ప్రారంభమైంది. ఆయన సుత్తిని తన సంచిలో పెట్టుకొని ఇంజను బాగైపోయింది అని వెళ్ళిపోయాడు.

ఒక వారం తరువాత ఓడ యజమానులకి ఆ పెద్దాయన వద్దనుంచి రూ. 10,000/–ల బిల్లు వచ్చింది. ఓడ యజమానులు ఏంటీ ఇతను ఏమీ చెయ్యలేదు, కేవలం ఒక్క సుత్తి దెబ్బ వేసినందుకు 10 వేల రూపాయల బిల్లు పంపుతాడు అనుకొని దయచేసి పూర్తి వివరాలతో బిల్లు పంపించండని పెద్దాయనని కోరారు.

దీనికా పెద్దాయన సుత్తితో కొట్టినందుకు రూ. 2/–, కానీ ఎక్కడ ఎంత బలంతో కొట్టాలో నిర్ణయించి నందుకు రూ. 9,998/–లు. అని వివరాలతో బిల్లు తిరిగి పంపించాడు.

**ఈ పెద్దాయనను చూస్తుంటే మన ఇన్నోవేటర్‌లు గుర్తుకు రావటం లేదూ!!!**

– హనీబీ 26(3) & 26(4) జులై–డిసెంబర్ 2015

సంపుటి-9 సంచిక - 6 సెప్టెంబర్ - అక్టోబర్ 2021

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 400/-**
**for 2 years Subscription**

## ఈ సంచికలో.....

* గ్రామీణ పారిశుధ్యం లక్ష్యంగా పని చేస్తున్న ఆశ్రమ వ్యవస్థాపకురాలు 'వెలిగొండ్ల పద్మజ' - 3
* సృజనశీలత, వినూత్న ఆలోచనలు, అసహనంతో ఉన్న చిన్నారులను పెంచటం ఎలా? - 5
* గ్రామ ప్రజలకు సౌకర్యాన్ని అందిస్తూ సంచార వెల్డింగ్ తో ఉపాధి పొందుతున్న రాముడు - 7
* 'పల్లెసృజన' ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలో 38వ చిన్న శోధయాత్ర - 10
* గ్రామీణ యువత స్వయం ఉపాధే లక్ష్యంగా 'పునాది స్థాయి ఇన్నోవేషన్లు' - 14
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 18
* ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం - 21
* వృక్షాయుర్వేదము - 24
* 10 వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు - 26
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 29
* స్పందన - 31

**కవర్ లోపలి పేజీల్లో ...**
'ఎక్కడ కొట్టాలో తెలిసి ఉండాలి' – హనీబీ కథ
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు
**మధ్య పేజీలో :**
సెప్టెంబర్ – అక్టోబర్ 2021లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# చిరు ధాన్యాలతో గ్రామ ప్రజల ఆరోగ్యం



గత పది సంవత్సరాలుగా దేశం నలుమూలలా, తెలుగు రాష్ట్రాల గ్రామాల్లో చిరు ధాన్యాలను పండించాలని, వాటిని ఆహారంగా విరివిగా అందరూ నిత్యం వాడాలని, తద్వారా ఆరోగ్యాలను కాపాడుకోవాలని ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు, సమాజ సంస్కర్తలు, పౌష్టికాహార నిష్ణాతులు, వైద్యులు, ప్రజారోగ్య ప్రతినిధులు, సహజ జీవనాన్ని సమర్థించే పెద్దలు, పాలేకర్ గారు, ఖాదర్ వలీ గారు, చిరు ధాన్యాల వ్యాపారస్తులు, రిటేల్ సంస్థలు అంతా ముమ్మరంగా కృషి చేస్తున్నారు. రసాయనాల వాడకం వ్యవసాయంలో మోతాదుకు మించినందున, ప్రజారోగ్యాలు పాడవడం, భూసారం తగ్గడం, ప్రకృతి కలుషితం కావడం, పశు పక్ష్యాదులకు సహజ ఆహారం లేకపోవడం ఈ దుష్ప్రభావాలను తగ్గించాలని దేశవ్యాప్తంగా చిరు ధాన్యాలు పండించాలని, వాటిని ప్రధాన ఆహారంగా విరివిగా వాడాలని సమాజం, వ్యవస్థ కృషి చేస్తున్న విషయం మీకందరికీ విదితమే. తెలుగు రాష్ట్రాల్లో 1,30,000 రైతులు పూర్తిగా ప్రకృతి సేద్యం వైపు మళ్ళారు. మరో మూడు లక్షల రైతులు ప్రకృతి సేద్యం వైపు వెళుతున్నారు.

ఇప్పుడున్న పద్ధతిలో రైతు చిరు ధాన్యాలు పండించి, మార్కెట్‌లో అమ్ముతాడు. వారి వారి జిల్లాల్లో ఉన్న ప్రాసెసింగ్ చేసే వ్యాపార కంపెనీలు రైతువద్ద రూ. 22-25లకు ప్రతి కేజీ కొంటారు. ఈ చిరు ధాన్యాల వ్యాపారవేత్తలు ప్రాసెస్ చేసి, తినడానికి తయారుగా మార్చి దాదాపు రూ. 70లకు కేజీ ప్రకారం పట్టణాల్లోని హోల్‌సేల్ కాని, రిటైల్ చిరు ధాన్యాల సంస్థలకు సరఫరా చేస్తారు. బ్రాండ్‌ను బట్టి, ప్రామాణికతను బట్టి, ప్యాకింగ్ వగైరాలతో పట్టణాల్లో కొనుగోలుదారుకు రూ. 100కు పైగా కేజీ అమ్మడం జరుగుతుంది. ఈ విధానంలో రెండు స్పష్టమైన నష్టాలు రైతుకు కలుగుతున్నాయి.

కష్టపడి చిరు ధాన్యాలు పండించిన రైతుకు సరియైన ధర రాకపోవడం మొదటి నష్టం. దీన్ని మార్చాలంటే గ్రామంలోనే రైతులు పండించిన చిరు ధాన్యాలను తినడానికి తగ్గట్టు చేయ గలగాలి. పండించిన పంటను అమ్మకుండా, వాటిని ప్రాసెస్ చేసి అమ్మితే రైతులకు అదనపు ఆదాయం వచ్చే అవకాశముంది. వీటికి తగ్గ సరియైన, అందుబాటులో ఉండే యంత్రాలను గ్రామాలకు సరఫరా చేయాలి. ఈ యంత్రాలు గ్రామాల్లోని యువత ఉపాధిగా మార్చుకుని గ్రామాల్లో చిరు ధాన్యాల ప్రాసెసింగ్‌ను ప్రారంభించాలి. కొంతమంది యువతకు ఉపాధి ఈవిధంగా లభించే అవకాశముంది. ఊరుకు సేవ చేస్తూ తమ ఉపాధిని సంపాదించుకోవడం మంచి ప్రతిపాదన. రైతునుండి యువతకు డబ్బు మారకం వల్ల గ్రామాల్లో సంపద (వెల్త్) పెరుగుతుంది. లక్షల గ్రామాల్లో యంత్రాలు సరఫరా చేయడం వల్ల ఎంతో ఉపాధిని, ఒక క్రొత్త పారిశ్రామిక విభాగాన్ని సృష్టిస్తుంది.

చిరు ధాన్యాల ప్రాసెసింగ్‌కై రైతులకు అందుబాటులో ఉండేవిధంగా డిజైన్ చేయడానికి స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలకు బాధ్యత అప్పగించాలి. కాలేజిలో ఇంజనీరింగ్ ఉపాధ్యాయులు, ఇంజనీరింగ్ విద్యార్థులు పరిసరాల్లోని రైతులతో సంప్రదించి, వారికి కావలసిన విధంగా చిరు ధాన్యాల ప్రాసెసింగ్ యంత్రాలను తక్కువ కాలంలో డిజైన్ చేసి వాడి, రైతులను ఒప్పించి, యంత్రాల ఉత్పత్తికి స్థానిక సమాజంలోని చిన్న సన్నకారు పారిశ్రామిక వేత్తలను, మేనేజ్‌మెంట్ మరియు ఇంజనీరింగ్ విద్యార్థులకు ఐటిఐ, పాలిటెక్నిక్ టెక్నీషియన్‌లను సంధానం చేయాలి. ఈ క్రియకు అవసరమైన ఆర్థిక సహాయం ఎఐసిటిఇ ద్వారా కాని స్థానిక ప్రభుత్వాల ద్వారా కాని, గ్రామీణ బ్యాంకులు, నాబార్డ్ ద్వారా కాని జరగాలి. వికేంద్రీకరణ పద్ధతిలో దేశమంతా ఇలాంటి ప్రక్రియను చేపడితే అన్ని విధాలుగా సమాజానికి అమితమైన మేలు జరుగుతుంది. ఈ ప్రతిపాదనను సఫలం చేయడం పూర్తిగా సాధ్యమవుతుందని 'పల్లెసృజన' విశ్వసిస్తున్నది.

రెండవ నష్టం రైతులకు ప్రస్తుత పద్ధతిలో జరుగుతున్నది వారి ఆరోగ్యానికి సంబంధించినది. చిరు ధాన్యాలు పండించడం వల్ల ప్రజల ఆరోగ్యం బాగు పడుతుందన్న విశ్వాసంతో వీటి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నాము కాని, పండించిన రైతులు చిరు ధాన్యాలను తినే అవకాశం మనం కల్పించటం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో పట్టణాల్లో ఉన్న ప్రజల ఆరోగ్యానికి మాత్రమే చిరు ధాన్యాల పరిశ్రమ (రైతుల నుండి వినియోగదారుని వరకు) పని చేస్తున్నది. ఇది పూర్తిగా అన్యాయం. 85 శాతం ప్రజలకు ప్రస్తుత వ్యవస్థలో చిరు ధాన్యాలు అందుబాటులో లేవు. దాంతో వారి ఆరోగ్యాలలో ఆశించిన మార్పు ఎలా వస్తుంది. పాతకాలంలో గ్రామాల్లోనే చిరుధాన్యాలను దంచి, విసరి తినటానికి తగ్గట్టుగా తయారు చేసుకునేవారు. ఇప్పుడు ఆ సౌకర్యం గ్రామాల్లో లేకుండా పోయిందన్న విషయం అందరికీ విదితమే. కాని వ్యవస్థ కాని, పారిశ్రామిక వేత్తలు కాని ఈ అంశానికి ప్రాధాన్యత ఇవ్వటం లేదు. వారి ప్రణాళికల్లో, నివేదికలలో గ్రామ ప్రజలకు అందుబాటులో చిరు ధాన్యాలను చేర్చడానికి ఎలాంటి సూచనలు లేవు. పండించిన రైతు అనుభవించకుండా దూరంగా ఉన్న ధనిక ప్రజలకు అంతా సరఫరా చేయడం ధనికవర్గ అహంకారం కాదా? వ్యాపార వేత్తల స్వార్థం లేదా? దీన్ని మార్చాలి.

పైన వివరించిన రెండు నష్టాలను ఒకేసారి తగ్గించాలంటే చిరు ధాన్యాల ప్రాసెసింగ్ గ్రామాల్లో జరగాలి. వారు తినాలి, ఎక్కువైంది ఇతరులకు, పట్టణాలకు పంచాలి. 85 శాతం ప్రజలు చిరుధాన్యాల ఆహారం తినగలిగితే దేశ ఆరోగ్య పరిస్థితి ఎంత మెరుగ్గా ఉంటుందో ఊహించ గలరా? భారత దేశ ఆరోగ్య స్థాయి ఎన్నోరెట్లు ఈ చిన్న ప్రక్రియతో శాశ్వతంగా పెరుగుతుందన్న విశ్వాసం 'పల్లెసృజన'కు ఉంది. దేశంలోని సర్వజనులను ఆరోగ్యవంతంగా చేయడానికి త్వరగా ఈ ప్రయత్నాన్ని అమలు చేస్తారని విశ్వసిస్తూ....

దీపావళి సమస్త ప్రజల జీవితాల్లో కాంతిని, ఆనందాన్ని, ఆరోగ్యాన్ని నింపాలని మనసారా ఆశిస్తూ....

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

# గ్రామీణ పారిశుధ్యం లక్ష్యంగా పని చేస్తున్న ఆశ్రమ వ్యవస్థాపకురాలు 'వెలిగొండ్ల పద్మజ'



- జమ్మలమడక శశిమోహన్

శరవేగంగా మారుతున్న మనుషుల అవసరాలు, వాటి పరిష్కారాల వల్ల సమాజానికి కొన్ని ఆహార పదార్థాలు సులభంగా లభ్యం అవుతున్నాయి కానీ, వాటి సరఫరాలో వినియోగించే ప్లాస్టిక్ వల్ల పట్టణాలు ప్లాస్టిక్ మయమై పోతున్నాయి. ఈ ప్లాస్టిక్ మహమ్మారి ఇప్పుడు గ్రామాలకు కూడా ఎగబాకింది. పట్టణాల్లో లభించే ప్రతి వస్తువు, తినుబండారాలు గ్రామాలలో కూడా విరివిగా లభిస్తున్నాయి. ప్లాస్టిక్ వస్తువుల అమ్మకాలు గ్రామాలకు విస్తృతంగా వ్యాపించాయి. ఆ వస్తువులను ప్యాక్ చేసిన ప్లాస్టిక్ వల్ల దాదాపు ప్రతి గ్రామంలో వ్యర్థాలను పారవేసే 'డంపింగ్ యార్డ్'లు తయారయ్యాయి.

ఇది ఒక రకం వ్యర్థాలతో గ్రామాలు నిండిపోవటం అయితే, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వీటితో పాటు మరో సమస్య వెంటాడుతోంది. అదే కొబ్బరి బోండాంల సమస్య. గ్రామాల్లో కొబ్బరినీళ్ళు త్రాగిన తర్వాత వాటిని ఎక్కడ పడితే అక్కడ పారవేయటంతో కొన్ని గ్రామాల్లో అయితే ఎటు చూసినా కొబ్బరి బోండాంలే దర్శనం ఇస్తున్నాయి. ఇవి మురగటానికి చాలా కాలం పడుతుంది. ఇలా పేరుకుంటూ పోతే భవిష్యత్ ఏమిటా అని ఆలోచించింది విజయ నగరం జిల్లా, పార్వతీ పురం గ్రామంలోని ఒక ఆశ్రమ నిర్వాహకురాలు 'వెలిగొండ్ల పద్మజ'.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటం కేవలం ప్రభుత్వ బాధ్యత అనుకోవటం పొరపాటు, మన గ్రామం పరిశుభ్రంగా ఉండటానికి మన వంతు శ్రమ తప్పక పడాల్సిందే అని ఆలోచించింది. తమ గ్రామంలో స్వచ్ఛంద సేవకులను తయారు చేసి ప్రతి ఇంటినుంచి పొడి చెత్త (డ్రై వేస్ట్) ను సేకరించే పని మొదలు పెట్టింది. ప్లాస్టిక్, కొబ్బరి బోండాంలు డంపింగ్ యార్డ్‌లో పారవేయకుండా, వాటిని తిరిగి ఉపయోగించే బృహత్తర కార్యక్రమానికి పూనుకున్నారు పద్మజ. ఇటీవల గ్రామాలలో 'మద్యం' అలవాటు పెరగటం వల్ల మద్యం సేవించినవారు వాడి పారవేసిన ప్లాస్టిక్ గ్లాసులే ఎక్కువగా కనిపిస్తు న్నాయట. వీటితో పాటు శీతల పానీయాలకు ఉపయోగించిన ప్లాస్టిక్ సీసాలు, గృహపయోగ వస్తు వులను ప్యాక్ చేసిన ప్లాస్టిక్ కవర్లు.. ఇలా చిన్న పిల్లల వద్ద నుండి పండు ముసలి వరకు ప్రతి ఒక్కరికి అవసరమైన తినుబండారాలు, వస్తువులు అన్నీ ప్యాక్ చేసేది మాత్రం 'ప్లాస్టిక్' తోనే ముడిపడి వుండటం వల్ల గ్రామాల్లో ప్లాస్టిక్ విపరీతంగా పేరుకుపోయి ఏ వీధి చూసినా ప్లాస్టిక్ మయంగా కనపడుతోంది. ఈ ప్లాస్టిక్ సహజ సిద్ధంగా భూమిలో కలిసి పోవాలి అంటే వందల, వేల సంవత్సరాలు పడుతుంది. వీటన్నిటినీ విచ్చల విడిగా బయట పారవేయకుండా ప్రత్యేకంగా చెత్త బుట్టలలో వేసేలా ప్రజలకు అవగాహన కల్పించి, వాటిని స్వచ్ఛంద సేవకుల ద్వారా లేదా అవసరమైనంత వరకు వారికి వేతనం ఏర్పాటు చేసిన వారి ద్వారా సేకరిస్తోంది. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్తులను కూడా కలుపుకొని వారిచేత కూడా పనికిరాని వ్యర్థాల సేకరణ చేపడుతున్నారు. **చెత్త సేకరించటం ఒక పని కాదు, ఒక అలవాటుగా మారాలి** అని ప్రయత్నిస్తున్నారు ఆమె. ఇలా సేకరించిన ప్లాస్టిక్‌ను ప్రస్తుతానికి వాటిని 'క్రషింగ్' చేసి ఉంచుతోంది. ఈ ప్లాస్టిక్‌ను ఏ విధంగా ఉపయోగించుకో గలిగితే బావుంటుంది, వాటివల్ల తమ గ్రామానికి ఎలా లాభం చేకూరుతుంది అని ప్రణాళిక వేస్తోంది.

ఇందుకోసం అవసరమైన యంత్రాలను కూడా తనకు తెలిసిన స్వచ్ఛంద సంస్థలు, దాతల వద్ద అవసరమైన నిధులను, యంత్రాలను సేకరిస్తోంది. వీటన్ని టికన్నా ముందుగా వ్యర్థాల సేకరణ ప్రధానం కాబట్టి అందుకు అవసరమైన 'ఇ–వాహనం' ఒకటి రూ. 1,23,000లు వెచ్చించి తీసుకుని, చెత్తను సేకరించే పని ప్రారంభించారు. సేకరించిన చెత్తను వివిధ రకాలుగా విభజించి, ఏదీ వృధా కాకుండా వాటిని పునర్ వినియోగ కరంగా తయారు చేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకు అవసరమైన యంత్రాలు, పరికరాలను తామే సమకూర్చుకోవాలన్న సంకల్పంతో నిధుల సేకరించటం జరుగుతోంది. ఇందుకోసం ఇప్పటికే రూ. 14 లక్షలకు పైగా నిధులను సేకరించటం జరిగింది.

ఈ కార్యక్రమం మొత్తానికి వారే 'పునర్వ' అనే ఒక పేరు నిర్ణయించుకొని పనులను మొదలు పెట్టటం

> **చిన్న పిల్లల వద్ద నుండి పండు ముసలి వాళ్ళ వరకు ప్రతి ఒక్కరికి అవసరమైన తినుబండారాలు, వస్తువులు అన్నీ ప్యాక్ చేసేది మాత్రం 'ప్లాస్టిక్' తోనే ముడిపడి వుండటం వల్ల గ్రామాల్లో ప్లాస్టిక్ విపరీతంగా పేరుకుపోయి ఏ వీధి చూసినా ప్లాస్టిక్ మయంగా కనపడుతోంది. ఈ ప్లాస్టిక్ సహజ సిద్ధంగా భూమిలో కలిసి పోవాలి అంటే వందల, వేల సంవత్సరాలు పడుతుంది.**

జరిగింది. ఏ ఒక్కరి వల్ల భవిష్యత్‌లో ఈ కార్యక్రమం ఆగిపోకూడదు అన్న ఉద్దేశ్యంతో గ్రామంలోని యువతతో పాటు పెద్దవారిని కూడా కలుపుకుని ఒక బృందాన్ని తయారు చేసింది. యువత గ్రామంలోకి వెళ్ళి చెత్తను సేకరించుకు వస్తే, పెద్దవారు ఆ చెత్తను విభజించే కార్యక్రమం చేస్తూ వుంటారు. ఇలా సేకరించి, క్రష్ చేసిన చెత్త నిలువలు కూడా ఒక భవనం ఎత్తుకు చేరుకున్నాయి. ఇక వీటిని పునర్వినియోగం ఎలా చేసుకోవాలి అని ప్రణాళికలు వేసుకుంటున్నారు.

ఈ బృహత్తర కార్యక్రమంలో మన 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు కూడా తమవంతు సహకారం అందిస్తున్నారు. 'పటాన్ సైదా' అనే చిలకలూరి పేటకు చెందిన ఇన్నోవేటర్ ఒక 'ఎలక్ట్రిక్ ఆటో' తయారు చేసి ఇస్తుండగా, తెలంగాణ మెట్‌పల్లికి చెందిన ఇన్నోవేటర్ 'అల్లాడి ప్రభాకర్' కొబ్బరి కాయ వ్యర్థాలను పునర్వినియోగానికి అనువుగా తయారు చేసే ఒక యంత్రాన్ని తయారు చేసి ఇస్తున్నారు.

పటాన్ సైదా తయారు చేసిన ఆటో వ్యర్థాలను సేకరించే పని కొరకు తక్కువ ఖర్చుతో పని చేస్తుంది. అల్లాడి ప్రభాకర్ తయారు చేసిన యంత్రం ఈ కొబ్బరి బోండాంలను క్రష్ చేసి, మెత్తటి పొడిగా తయారు చేస్తుంది. ఈ పొడిని కంపోస్ట్ చేయటం ద్వారా ఆ గ్రామస్తులకు మంచి ఎరువు అందించాలన్న సదుద్దేశ్యంతో కార్యక్రమం రూపొందిస్తున్నారు. ఈ ఎరువు ఎన్నో పోషక విలువలతో కూడుకున్నదిగా వుంటుందని అనుకుంటున్నారు. అలాగే మెత్తటి పొడిని 'కోకో పిట్' గా తయారు చేసి, ఆ ప్రాంతంలో వున్న నర్సరీలకు సరఫరా చేయటం ద్వారా పనికి రాని, అడ్డంగా వున్న చెత్తనుంచి కూడా కొంత ఆదాయాన్ని పొందవచ్చు.

పార్వతీపురం పరిసర ప్రాంతాల్లో **చేపల చెరువులు కూడా ఉన్నాయి కాబట్టి వాటి నుండి కూడా చేపల వ్యర్థాలను సేకరించి వాటితో 'ఫిష్ అమినో' లాంటి వ్యవసాయానికి అవసరం అయిన పురుగు మందులను కూడా తయారు చేసే** పనిలో నిమగ్నమయ్యారు. గ్రామీణులు కూడా చెత్తను పారవేయకుండా చెత్త బుట్టలలో తీసి వుంచేలా ఏర్పాటు చేయటానికి వారికి దీని వల్ల కలిగే లాభాల పట్ల పాఠశాల విద్యార్థులచేత అవగాహన కల్పిస్తున్నారు. ఒక ఇంట్లో 'అమ్మ' చదువుకున్నది అయితే ఆ ఇంట్లో అందరూ చదువు వైపు అడుగులు వేస్తారు. అదే విధంగా ఒక ఇంట్లో ఎవరో ఒకరు 'పరిశుభ్రత' పై మక్కువ వుంటే ఆ ఇంటితో పాటు, పరిసర ప్రాంతాలు కూడా పరిశుభ్రంగా ఉంటాయి అనటంలో అతిశ యోక్తి ఏమీ లేదు. ఈ చెత్తను పునరుత్పత్తి చేయటం ద్వారా మన గ్రామానికి ఎంతో లాభం చేకూరుతుంది అని, అలా వచ్చిన లాభాలను తిరిగి గ్రామ స్తులకే చేరేలా చర్యలు చేపడుతున్నామని చెప్ప టంతో వారు కూడా ఈ పనిలో తమవంతు సహకారం అందిస్తున్నారు.



కొబ్బరి బోండాంలను క్రష్ చేసి, మెత్తటి పొడిగా తయారు చేసి, ఈ పొడిని కంపోస్ట్ చేయటం ద్వారా ఆ గ్రామస్తులకు మంచి ఎరువు అందించాలన్న సదుద్దేశ్యంతో కార్యక్రమం రూపొందిస్తున్నారు. ఈ ఎరువు ఎన్నో పోషక విలువలతో కూడుకున్నది గా వుంటుందని అనుకుంటున్నారు. అలాగే మెత్తటి పొడిని 'కోకో పిట్' గా తయారు చేసి, ఆ ప్రాంతంలో వున్న నర్సరీలకు సరఫరా చేయటం ద్వారా పనికి రాని, అడ్డంగా వున్న చెత్తనుంచి కూడా కొంత ఆదాయాన్ని పొందవచ్చు.



చెత్తను సేకరించి పునర్వినియోగం చేసే పనిలో ఇంతవరకు ఎంతోమంది స్వచ్ఛందంగా చేసినా, వారి కుటుంబ అవసరాలను కూడా తీర్చడం తమ బాధ్యత అని గుర్తించి, ఇప్పటి నుండి వారికి ఎంతోకొంత గౌరవ వేతనం అందిస్తే ఈ పని ఇంకా సమర్థవంతంగా చేస్తారని భావించి, వారికి కొంత నగదు రూపేణా కూడా చెల్లిస్తున్నారు.

ఇంట్లో చెత్తను అడ్డదిడ్డంగా పారవేయకుండా, ఒకచోట ప్రోగు చేసి, దాన్ని చెత్తను సేకరించే వాళ్ళకు అందిస్తే, ఆ ఇంటి వారికి నగదు రూపేణ కాకుండా వస్తు రూపేణ ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. అంటే రైతులకు సేంద్రియ వ్యవసాయం చేయటానికి అనువైన కషాయాలు తయారు చేసుకునేందుకు అవసరమైన ఆయుర్వేద మొక్కలను ఇవ్వటం, రైతులు కాని వారి కోసం వారి ఆహారానికి అవసరమైన కూరగాయలు, కరివేపాకు లాంటి విత్తనాలు, మొక్కలను ఇవ్వటం వల్ల వారు కూడా ఎంతో సంతోషంగా వాటిని వినియోగించుకుంటున్నారు. రైతులు తమ కషాయాలు తయారు చేసుకుంటూ వుంటే, ఇతరులు తమ కూరగాయల కొరకు ఖర్చు లేకుండా తామే పండించుకుంటున్నారు. ఈ రకంగా వారికి అదనపు ఖర్చు లేకుండా చేశారు.

కొంతమంది గ్రామీణులు తమ చెత్తను తామే పునరుత్పత్తి చేసుకునేందుకు అవసరమైన అవగాహనను కూడా కల్పిస్తున్నారు.

పార్వతీపురంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తర్వాత ఆ పరిసర గ్రామాల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలను ముమ్మరం చేయాలని చూస్తున్నారు పద్మజ. గ్రామ పరిశుభ్రత కేవలం ప్రభుత్వాలదే కాదు, సమాజానిది కూడా అని సగర్వంగా చేసి చూపుతున్న పద్మజ గారికి 'పల్లెసృజన' అభినందనలతో పాటు సంపూర్ణ సహకారం కూడా అందించేందుకు సిద్ధంగా ఉంది. వీరి ఆదర్శాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి గ్రామం ఆచరించి, 'స్వచ్ఛ భారత్' ఉద్యమంలో తెలుగు వారు ముందు వరుసలో ఉండి నడిపిస్తున్నారు అనే పేరును సంపాదించుకోవాలని మనసారా ఆశిస్తోంది 'పల్లెసృజన'. ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన పద్మజ గారిని అభినందిస్తూ, ప్రతి గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు గ్రామీణులు ముందుకు వస్తారని ఆశిద్దాం.

# సృజనశీలత, వినూత్న ఆలోచనలు, అసహనంతో ఉన్న చిన్నారులను పెంచటం ఎలా?



ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉండాలని కోరుకుంటారు కానీ, చాలా సందర్భాలలో వాళ్ళను రక్షించుకోవాలి అనే ఉద్దేశ్యంతో అవసరాలకి మించిన జాగ్రత్తలు తీసుకుంటూ వారిని ఉక్కిరి బిక్కిరి చేస్తూ వారిలోని సృజనాత్మకతను తమకి తెలియకుండానే అణచివేస్తుంటారు. వాళ్ళ ఇష్టానుసారం, వాళ్ళ స్వాతంత్ర్యానికి భంగం కలుగకుండా, భవిష్యత్తులో భాధ్యతాయుత పౌరులుగా పిల్లలని తీర్చి దిద్దటం సాధ్యమా? ఎలా?

మా శోధ యాత్రలో భాగంగా మేము దేశంలోని వివిధ మారుమూల ప్రాంతాలలో పర్యటిస్తున్నపుడు పాఠశాలల్లో, గ్రామాలలో, మార్గం ప్రక్కన కుతూహలంతో వచ్చిన పిల్లలకి కూడా సృజనాత్మకతపై పోటీలు నిర్వహించే వాళ్ళం. మాకు ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటి అంటే ప్రతి సందర్భంలో పిల్లలు తమ చుట్టూ ఉండే సమస్యలకు సృజనాత్మకమైన ఆలోచనలతో సమాధానాలు వెతికే వారు. ఇదే పట్టణ ప్రాంతాలలో అయితే సమస్యను వివరించి, పరిష్కారం గురించి ఆలోచించమని ప్రత్యేకంగా ప్రోద్బలం చేసినా, తక్కువ సమాధానాలు వచ్చేవి. కానీ పల్లె ప్రాంతాలలో మాత్రం అలవోకగా రకరకాల పరిష్కార మార్గాలు చెప్పేవారు పిల్లలు. మన చుట్టూ ఉండే సమస్యలపై అవగాహన కల్పించుకొని వాటి పరిష్కారానికై ఉరకలు వేస్తూ ఆలోచించే విధంగా తీర్చి దిద్దటం ఎలా?

చాలా సందర్భాలలో పిల్లలు అడిగే ప్రశ్నలకి పెద్దల దగ్గర సమాధానాలు తయారుగా ఉండవు. ఇటువంటి సందర్భాలలో పెద్దలు ఏదో సాకు చెప్పి సమాధానం చెప్ప కుండా ప్రశ్నను దాటవేస్తూ ఉంటారు. వాళ్ళకి సమాధానం తెలియదు అని ఒప్పుకోరు, ఆ ప్రశ్నకి సరియైన సమాధానం తెలిసిన వాళ్ళ ద్వారా కూడా చెప్పించే ప్రయత్నం చెయ్యరు. ఈవిధంగా చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల లోని కుతూహలాన్ని చంపేస్తున్నారు.

మొట్ట మొదటిగా వాళ్ళలోని కుతూహలాన్ని చంపేయకుండా కొనసాగించేలా చూడాలి. చాలా సందర్భాలలో పిల్లలు అడిగే ప్రశ్నలకి పెద్దల దగ్గర సమాధానాలు తయారుగా ఉండవు. ఇటువంటి సందర్భాలలో పెద్దలు ఏదో సాకు చెప్పి సమాధానం చెప్ప కుండా ప్రశ్నను దాటవేస్తూ ఉంటారు. వాళ్ళకి సమాధానం తెలియదు అని ఒప్పుకోరు, ఆ ప్రశ్నకి సరియైన సమాధానం తెలిసిన వాళ్ళ ద్వారా కూడా చెప్పించే ప్రయత్నం చెయ్యరు. ఈవిధంగా చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల లోని కుతూహలాన్ని చంపేస్తున్నారు. ఎట్టి పరిస్థితులోను ఈవిధంగా చెయ్యకూడదు.

ఇక రెండవది. పిల్లలని వేరువేరు ఆర్థిక, సామాజిక, శారీరక బేధాలు ఉండే ఇతర పిల్లలతో కలిసి తిరిగే అవకాశాలు ఎక్కువ కల్పించాలి. ఈవిధంగా చేస్తే బహుశా మన పిల్లలలో తమకన్నా ఎక్కువ/ తక్కువ స్థితి గతులలో, పరిస్థితులలో వున్న ఇతర పిల్లలను చూస్తే వీరిలో సంవేదశీలత పెరగవచ్చు. ఒకసారి ఇతరుల కష్టాలు, పరిస్థితులు అర్థం చేసుకుంటే వ్యకితగతంగా కానీ, అందరూ కలిసి కానీ సమాధానాలు వెతికే అవకాశాలు పెరుగుతాయి.

ఇక మూడోది, ఎట్టి పరిస్థితుల్లోను పిల్లల తరఫున, పిల్లల కోసం వారు చేసినట్లు మనమేమీ చేయకూడదు. చాలామంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా తామే ఆలోచించి, వస్తువులను తయారు చేసి, పిల్లలకిచ్చి, మీరు చేసినట్లుగా వీటిని సృజనాత్మక పోటీలలో ప్రదర్శించండి అని అంటూ ఉంటారు. దీంతో రెండు తప్పులు చేసిన వారం అవుతాము. ఒకటి పిల్లలలో వారంతట వారే ఆలోచించి చెయ్యాలి అనే భావనను చంపేస్తున్నాము. రెండోది పిల్లలకి తప్పు చెయ్యమని నేర్పుతున్నాము అని గుర్తించండి. ఒక్కసారి పిల్లలు తమది కాని ఆలోచనని, వస్తువుని తమది అన్న భావంతో చూడటం మొదలు పెడితే అది వారి జీవితంలో చెడు ప్రభావం చూపించి, ప్రతి విషయంలో అదే తప్పు చేసే నడవడిక అలవర్చుకుంటారు. ఈవిధంగా జరగటం వలన సమాజంలో సృజనాత్మకత, కొత్త ఆలోచనలు, ఇతరుల గురించి ఆలోచించటం లాంటి పునాదులపై నిర్మించాల్సిన సమాజానికి తూట్లు పొడుస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లో ఈవిధంగా చేయరాదు. పిల్లలని పిల్లలుగానే ఉండనీయండి. వారికి బహుమతులు వచ్చాయా? లేదా అన్నది ముఖ్యం కాదు, అంతకన్నా ముఖ్యమైనది వారి స్వంత ఆలోచనలని, వారి ఊహా శక్తిని, దీన్ని నేను సాధించగలను అన్న అలవాటుని, తమకు తోచిన విధంగా ఆచరించే దిశలో వాళ్ళు సాగుతున్నారా లేదా అన్నది ముఖ్యం. ఈ పై విషయాలు పిల్లల్లో ఉన్నాయా కొనసాగిస్తున్నామా అని తెలుసుకోవాలంటే పోటీని నిర్వహించే నిర్వాహకులు పిల్లలు ప్రదర్శించే వస్తువులలో చిన్న మార్పులు చేసి, అవసరమనుకుంటే కనెక్షన్ తీసేసి, దీన్ని ఏవిధంగా సరిచేస్తావు అని అడగాలి. అప్పుడే పిల్లల్లోని స్వంతంగా పుట్టి పెరిగిన సృజనాత్మకత బైట పడుతుంది.

ఇక నాల్గవది, పిల్లలలో పెంపొందించాల్సిన గుణాలలో వారికి ఎవరైనా సహాయం చేస్తే దానిని మనస్ఫూర్తిగా, హృదయ పూర్వకంగా ధన్యవాదాలు చెప్పాలి అన్నది. జ్ఞాన సమాజం అన్నది నమ్మకం, పారదర్శకత, కలిసి పని చేయటం అన్న పునాదులపై నిర్మితమై ఉంటుంది. చాలా సందర్భాలలో ప్రశ్నలకి సమాధానా లు కనుక్కోవడం, పరిష్కారాలు వెతకడం అన్నది కేవలం ఒక్కరి వల్ల కాక, చాలా మంది కలిసి చేసినది అయి వుంటుంది. అలాంటప్పుడు ఆ సమాధానాలకి కారణమైన అందరు వ్యక్తులకి పేరుపేరునా ధన్యవాదాలు చెప్పుకోవడం సబబు కదా. ఇటువంటి సద్గుణం పిన్న వయసులోనే పిల్లలో ప్రవేశ పెడితే వారు పెద్దయ్యాక తమ స్వంత ఆలోనలతో ఇతరులతో కలిసి పని చేసే కార్యశూరులు అవుతారు.

ఇక ఐదవది, మనము ఏ సమస్యనైతే పరిష్కరించ దలచుకున్నామో దానిమీద పూర్తి అవగాహన సంపాదించాలి. ఇంకోవిధంగా చెప్పాలంటే ఆ సమస్యని మనమే అనుభవించాలి. గతంలో ఎన్ఐఎఫ్ వారి ఆధ్వర్యంలో 'హనీబీ నెట్‌వర్క్' కానీ, 'సృష్టి' లేదా 'గియాన్' లలో పిల్లలకి సృజనాత్మకతపై కార్యశాలలు నిర్వహించినపుడు వారికి "ముందు పరిశోధించటం, తర్వాత ఆలోచించి పరిష్కారం కనుక్కోవడం" అన్న విషయంపై ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చేవాళ్ళం. ఈ ప్రక్రియలో భాగంగానే పిల్లలని పేదవారు ఉండే గుడిసెలలోకి లేదా చేతిపనులు చేసేవారి దగ్గరకు లేదా ఆర్థికంగా వెనకబడిన ప్రజలు ఉండే ప్రదేశాలకి

తీసుకొని వెళ్ళి, అక్కడి జనాలతో కలిసి మెలిసి ఉండి, వారి స్థితి గతులు తెలుసుకొని వారితో చర్చలు జరిపి, వారిని మాటల్లో పెట్టి, వారిని పరిశీలించి, వారు వ్యక్తిగతంగా కానీ, సామాజికంగా కానీ ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన ఏర్పరచుకొనేలా చెయ్యాలి. క్షేత్ర స్థాయి నుండి తిరిగి వచ్చిన తర్వాత వారు తాము గుర్తించిన సమస్యలకి విడిగా కానీ, గుంపులుగా కానీ కలిసి ఆలోచించి పరిష్కారాలు సూచించాలి. వారు పరిష్కారాలు సూచించేటపుడు వారు ఏవిధంగా ఆ పరిష్కారాలు సూచిస్తున్నారు? ఏమి నేర్చుకొని, ఏమి చూసి, దేని ఆధారంగా ఈ పరిష్కారాలు సూచిస్తున్నారు? మొదలైనవి మిళితమై ఉంటాయి కనుక వారు చూపించిన పరిష్కారాలు తప్పకుండా పని చేసే దిశగా ఉంటాయి. ఎందుకంటే వారు సమస్యని దగ్గర నుండి చూశారు, అనుభవించారు. ఆ తరువాతనే పరిష్కారం సూచిస్తున్నారు. అంటే సంవేదన తర్వాత సృజనశీలత వచ్చింది. ఇందులో పూర్తిగా తెలుసుకొని, అందులో భాగమై, దానికి పరిష్కారం కనుగొన్నపుడే ఖచ్చితమైన ఫలితాలు వస్తాయి. మేము నిర్వహించిన 'ఇగ్నైట్' లాంటి అనేక పోటీలలో పిల్లలు సృష్టించిన పరిష్కార మార్గాలు బాగుండటానికి, నిజమే కదా ఈ విధంగా చేస్తే బాగుంటుంది కదా అని అనిపించటానికి కారణం 'అవి పిల్లల సున్నితమైన హృదయ స్పందన నుంచి వచ్చిన పరిష్కారాలు'.

వారు చూపించిన పరిష్కారాలు తప్పకుండా పని చేసే దిశగా ఉంటాయి. ఎందుకంటే వారు సమస్యని దగ్గర నుండి చూశారు, అనుభవించారు. ఆ తరువాతనే పరిష్కారం సూచిస్తున్నారు. అంటే సంవేదన తర్వాత సృజనశీలత వచ్చింది. ఇందులో పూర్తిగా తెలుసుకొని, అందులో భాగమై, దానికి పరిష్కారం కనుగొన్నపుడే ఖచ్చితమైన ఫలితాలు వస్తాయి. మేము నిర్వహించిన 'ఇగ్నైట్' లాంటి అనేక పోటీలలో పిల్లలు సృష్టించిన పరిష్కార మార్గాలు బాగుండటానికి, నిజమే కదా ఈ విధంగా చేస్తే బాగుం టుంది కదా అని అనిపించటానికి కారణం 'అవి పిల్లల సున్నితమైన హృదయ స్పందన నుంచి వచ్చిన పరిష్కారాలు'.

చాలా సందర్భాలలో పిల్లలు కేవలం ఆలోచనని చెపితే ఎన్ఐఎఫ్ ఇంజనీరింగ్ విభాగం వారు పిల్లల ఆలోచనకి రూపకల్పన ఇచ్చి, పని చేసే నమూనాలను వస్తువులుగా తయారు చేసేవారు. ఇది బాగానే ఉంది. ప్రత్యేకించి చిన్న పిల్లలకి వివిధ పనిముట్లు వాడి, తమకి కావలసిన వస్తువును తయారు చేసుకునే పరిజ్ఞానం, నేర్పు లేనప్పుడు ఇదే సరియైన పద్ధతి. ఈ పద్ధతిలో పిల్లలకి తమ ఆలోచనలు ఆలోచనల స్థాయిలోనే కాదు, వాటికి రూపకల్పన ఇచ్చే ఒక మార్గం ఉంది అన్న ధైర్యంతో ఎక్కువ ఆలోచనలు బహిర్గతం చేసే అవకాశాలుంటాయి. దీనికోసం వారు ఇంకా స్వేచ్ఛగా, ధైర్యంగా ఆలోచించ గలిగుతారు. పిల్లల ఆలోచనలకి రూపకల్పన చేయటమే కాక, ఆ పిల్లల పేరునే వాటి పేటెంట్ అధికారాలు కూడా సంపాదించటమే కాక, అవకాశం వున్న చోట ఆ వస్తువులని వాణిజ్యపరంగా విక్రయించేలా ఏర్పాటు చేస్తోంది.

ఇటువంటి పరిస్థితుల్లో, ఇటువంటి ఆలోచనలతో, ఇటువంటి ఫలితాలతో సమాజంలో పెరిగిన పిల్లలు పెరిగి పెద్దయ్యాక భారతదేశ భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదుగుతారు అన్నదాంట్లో ఎటువంటి సంశయం లేదు. వారు తప్పనిసరిగా తమ తోటి పౌరులకి మేలు జరిగే లాగనే ప్రవర్తిస్తారు.

ఎన్ఐఎఫ్ వారు ఇటువంటి పోటీలు నిర్వహించడం ఎందుకో ఆపేశారు. కానీ హనబీ నెట్‌వర్క్ డా. ఎపిజె అబ్దుల్ కలాం 'ఇగ్నైట్ మైండ్ – చిల్డ్రన్స్ క్రియేటివిటీ ఇన్నోవేషన్ అవార్డ్స్' పేరిట పోటీలను కొనసాగిస్తోంది. ఈ హనీబీ పోటీలకి పిల్లలు ఎన్ని ఎంట్రీలైనా వారి అధ్యాపకుల హామీపత్రం లేకుండానే నేరుగా ignitedmind@honeybee.org కి పంపించవచ్చు.

– ప్రొఫెసర్ అనిల్ కె. గుప్త,
'పద్మశ్రీ' పురస్కార గ్రహీత

## పునాది స్థాయి ఆవిష్కరణలు (గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్) పై 'వెబినార్‌లు'

అక్టోబర్ 2020 నుండి ప్రతి వారం నిర్వహించ బడుతున్నవి.
ఇప్పటి వరకు

**45 వెబినార్లు నిర్వహించడం జరిగింది**
**166 ఇన్నోవేషన్లు పరిచయం చేయబడినవి**
**87 మంది ఇన్నోవేటర్లు.**
**48 మంది అతిథులు పాల్గొనటం జరిగింది.**

**ఇన్నోవేటర్లు తమ ఆవిష్కరణలు (ఇన్నోవేషన్) వీడియోల ద్వారా ప్రదర్శిస్తారు.**

**ప్రతి బుధవారం**

**రాత్రి 7 గం.ల నుండి 8-15 ని.ల వరకు**

నిర్వహించ బడుతుంది.

పాల్గొనాలి అనుకునేవారు **ఈ క్రింది లింకుల ద్వారా మీ మొబైల్ లేదా కంప్యూటర్ లో** పాల్గొనవచ్చు.

**అందరూ ఆహ్వానితులే.**

Google meet link : **https://meet.google.com/mrj-seot-ntq**
outube live : **https://youtu.be/NVgUnpmUdK8**

# గ్రామ ప్రజలకు సౌకర్యాన్ని అందిస్తూ సంచార వెల్డింగ్ తో ఉపాధి పొందుతున్న రాముడు





- పల్లె వీరరాఘవ రెడ్డి

పూర్వం గ్రామాల్లో దాదాపు ప్రతి కల్లానికి వున్న 'కంత'కు కర్రతో చేసిన రక్షణ ఏర్పాటు చేసుకునే వారు. దాన్ని 'పల్గాడి' అనేవారు. మారుతున్న కాలంతో గ్రామాలు కూడా కాంక్రీట్ మయమై ఇప్పుడు ఆ కంతల స్థానంలో ఇనుముతో తయారు చేసిన 'గేట్'లు వచ్చి పడ్డాయి. పెద్ద పెద్ద రైతుల ఇళ్ళకు కూడా ఈ పల్గాడిలు వుండేవి కానీ ఇప్పుడు వాటి స్థానంలో పెద్ద పెద్ద గేట్లు వచ్చి చేరాయి. వీటిని సమీప పట్టణాల్లో తయారు చేయించుకుని తమ ఇళ్ళకు నిర్మించుకుంటున్నారు. పెద్ద రైతులు మంచి ఇనుప గేట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు.

అంతే కాదు ఇప్పుడు గ్రామాల్లో వడ్రంగి తయారు చేసిన వ్యవసాయ పనిముట్లు కూడా కరువైపోతున్నాయి. ఎప్పుడో తమ పూర్వీకులు చేసిన పనిముట్లు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఇనుప వ్యవసాయ పనిముట్లు వాటి స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. ఇందుకు కారణాలు అనేకం. ఎవరి కారణాలు వారు చెబుతున్నారు. వడ్రంగిని అడిగితే 'ఇప్పుడు మావద్ద వచ్చి వ్యవసాయ దారులు వ్యవసాయ పనిముట్లు ('గడెం పనులు' అంటారు) చేయించు కునే వారే కరువు అయ్యారు. ఆ కాలం మారి పోయింది' అంటారు. ఇదే వియాన్ని గురించి రైతులకు అడిగితే 'ఇప్పుడు గడెం పనులు చేసే కమ్మరి వాళ్ళు ఎవరు ఉన్నారు.



వ్యవసాయ పనిముట్లు, ఇళ్ళకు, కళ్ళాలకు గేట్లు, ఎద్దుల బండ్లు లాంటివి సమీప పట్టణాల నుంచి చేయించుకుని ఉపయోగిస్తున్నారే కానీ, వాటి మరమ్మత్తులను చేయించుకోలేక చాలామంది మూలన పడేసే పరిస్థితి ఉంది. ఎందుకంటే వాటిని రిపేరు చేయించాలంటే మళ్ళీ ఏదైనా వాహనంలో పట్టణానికి తీసుకు వెళ్ళి వెల్డింగ్ చేయించుకోవాలి. అందుకు అయ్యే ఖర్చు దాదాపు కొత్తది కొన్నంత అవుతుంది. ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొన్నాడు ఆంధ్రప్రదేశ్ లోని చిలకలూరి పేటకు చెందిన 'అన్నపురెడ్డి రాముడు'.

అంతా పట్టణాలకు పోయి కార్పెంటర్ పనులు చేస్తున్నారు తప్ప ఈ పనులు చేసే వారే లేరు. అస్సలు ఇప్పటి తరం కమ్మరి వాళ్ళకు నాగలి, గొర్రు, గుంటక కొయ్యలు చెయ్యటమే రాదు. ఇక ఎద్దుల బండి చక్రాలు చేసే నాథుడే లేడు' ఇప్పుడు వాటి స్థానంలో టైర్ల బండ్లు వచ్చాయి అని వాపోతున్నారు.

ఈ వ్యవసాయ పనిముట్లు, ఇళ్ళకు, కళ్ళాలకు గేట్లు, ఎద్దుల బండ్లు లాంటివి సమీప పట్టణాల నుంచి చేయించుకుని ఉపయోగిస్తున్నారే కానీ, వాటి మరమ్మత్తులను చేయించుకోలేక చాలామంది మూలన పడేసే పరిస్థితి ఉంది. ఎందుకంటే వాటిని రిపేరు చేయించాలంటే మళ్ళీ ఏదైనా వాహనంలో పట్టణానికి తీసుకు వెళ్ళి వెల్డింగ్ చేయించుకోవాలి. అందుకు అయ్యే ఖర్చు దాదాపు కొత్తది కొన్నంత అవుతుంది.

సరిగ్గా ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొన్నాడు ఆంధ్రప్రదేశ్ లోని చిలకలూరి పేటకు చెందిన 'అన్నపురెడ్డి రాముడు'. వీరు నలుగురు అన్నదమ్ములు అందులో చిన్నవాడు 'రాముడు', వీరికి ఒక అక్క కూడా ఉంది. వీరి తల్లిదండ్రులు చాలా కాలం క్రితమే దివంగతులైనారు. నలుగురు అన్నదమ్ములూ వెల్డింగ్ పనినే జీవనాధారంగా చేసుకున్నారు. వీరి అన్న ఇటీవల 'కరోనా' తో మృతి చెందాడు. మిగిలిన ముగ్గురులో ఇద్దరు చిలకలూరిపేట లోనే జీవిస్తుండగా మరో అన్న గుంటూరు పట్టణంలో నివసిస్తున్నాడు. రాముడికి ముగ్గురు అమ్మాయిలు.

రాముడు ఏమీ చదువుకోలేదు. మొదట్లో కార్లు జీపుల కార్ఖానాలో 'టింకరింగ్' పని చేసేవాడు. ఆ పనిలోనే కొంత వెల్డింగ్ గురించిన అవగాహన పెరిగింది. ఆ తర్వాత కొంత కాలానికి తన కుటుంబ పోషణ భారంగా మారటంతో ఈ జీతం డబ్బుతో కుటుంబ పోషణ కష్టమని భావించి ఈ సమస్య నుండి బయట పడాలంటే ఏదైనా స్వంతంగా చేసే

పని వెతకటం మొదలు పెట్టాడు. అప్పుడు ఒక ఆలోచన తట్టింది. ఏదైనా వస్తువు వెల్డింగ్ చేయాలి అంటే ఆ వస్తువును తప్పక వెల్డింగ్ షాపు వద్దకు తీసుకు రావాలి. పట్టణాల్లో వున్నవారైతే వెల్డింగ్ షాపు వద్దకు వచ్చి తమ సమస్య చెబితే, ఆ షాపు వారు వచ్చిన వినియోగదారుడు తమ వస్తువును షాపు వద్దకు తీసుకు రాలేని పరిస్థితి వుంటే వీళ్ళే వెల్డింగ్ చేసే యంత్రాన్ని అక్కడికి తీసుకు వెళ్ళి వినియోగదారుడి ఇండివద్దనే వెల్డింగ్ చేసి వస్తూ వుంటారు అన్న విషయాన్ని గమనించాడు. పట్టణాల్లో ఉన్నవారు తమకు దగ్గరలోని వెల్డింగ్ పనివారిని సంప్రదించి తమ పని చేయించుకుంటారు. మరి గ్రామీణుల పరిస్థితి ఎలా? అని ఆలోచించాడు. వారి వద్దకే వెల్డింగ్‌చేసే యంత్రం తీసుకు వెళ్తే అదే మంచి వ్యాపారం అవుతుంది కదా అనుకున్నాడు. తన అవసరానికి తగ్గ వాహనాన్ని తానే ఎలా తయారు చేసుకోవాలో వివిధ వ్యాపారుల వాహనాలను గమనించి తన వాహనాన్ని తానే తయారు చేసుకున్నాడు. ఇందుకు తాను మొదట పని చేసిన కార్ల టింకరింగ్ షాపు అనుభవం కొంత పనికి వచ్చింది.

ఒక చేతక్ స్కూటర్ ఇంజన్ తీసుకుని తానే స్వయంగా తనకు అనుకూలమైన ఒక మూడు చక్రాల వాహనాన్ని తయారు చేసుకున్నా డు. అందులోనే గ్యాస్ వెల్డింగ్ చేయటానికి అవసరమైన సిలిండర్, ఇతర పరికరాలు, ఆర్క్ వెల్డింగ్ అవసరమైన వెల్డింగ్ యంత్రం, అవసరమైన ఇనుమును





ముక్కలుగా చేసే ఒక కట్టింగ్ యంత్రం, ఇంకా ఇతర సామాగ్రి దాదా పు 3 క్వింటాళ్ళ వరకు బరువుండేవి అన్నీ ఆ వాహనం లో వేసుకుని తమ పరిసర గ్రామాల్లో రోజు ఒక్కో దారిలో ప్రయాణం సాగిస్తూ గ్రామీణుల వద్దకే వెళ్ళి వారికి అవసరమైన వెల్డింగ్ పనులను వారి ఇంటివద్దకే వెళ్ళి చేసి వస్తూ వుంటాడు.

గ్రామాలు కూడా కాంక్రీట్ వనంగా మారటం వల్ల దాదాపు ప్రతి ఇంటికీ, వ్యవసాయ పనులకు ఉపయోగంగా ఉండేందుకు అవసర మైన పెద్ద రైతులు తమ కళ్లాలకు ప్రస్తుతం ఇనుప గేట్లను ఏర్పాటు చేసుకున్నారు. వీటిని మొదట కొత్తవి ఏర్పాటు చేసుకుంటూ వుంటారు. ఇలా తయారు చేసిన వాటిలో ఒక్కో సారి ఎక్కడో ఒక చోట వెల్డింగ్ తక్కువగా ఉండటమో, లేదా ఏదైనా పొరపాటు వల్లనో జరిగిన పనుల వల్ల ఆ గేటు ఎక్కడో ఒకచోట వెల్డింగ్ ఊడిపోయి, గేటు వెయ్యటానికి అనువుగా లేకపోతే? ఆ యజమాని ఆ గేటుని మళ్ళీ ఏదైనా వాహ నంలో సమీపంలోని వెల్డింగ్ షాపు వద్దకు వెళ్ళి దాన్ని వెల్డింగ్ చేయిం చుకుని తిరిగి తీసుకు వచ్చి, తన గేటును అమర్చుకోవాల్సి వుంటుంది. ఈ గేటు తీయటానికి ఇరువైలా వున్న గోడను పగల గొట్టాల్సిన అవసరం వస్తే మళ్ళీ అదో ఖర్చు.

ఈ మొబైల్ వెల్డింగ్ షాపు ద్వారా ఉభయులకూ, ముఖ్యంగా గ్రామీణులకు ఎంతో లాభదాయకంగా మారింది. ఈ స్వయం ఉపాధి వల్ల ఉభయులూ ఎలా లాభపడతారో కొన్ని ఉదాహరణలు ...... గ్రామాలు కూడా కాంక్రీట్ వనంగా మారటం వల్ల తమ కళ్లాలకు ప్రస్తుతం ఇనుప గేట్లను తయారు చేయించేటపుడు వాటిలో ఒక్కోసారి ఎక్కడో ఒక చోట వెల్డింగ్ తక్కువగా ఉండటమో, లేదా ఏదైనా పొరపాటు వల్లనో జరిగిన పనుల వల్ల ఆ గేటు ఎక్కడో ఒకచోట వెల్డింగ్ ఊడిపోయి, గేటు వెయ్యటా నికి అనువుగా లేకపోతే? ఆ యజమాని ఆ గేటుని మళ్ళీ ఏదైనా వాహనంలో సమీపంలోని వెల్డింగ్ షాపు వద్దకు వెళ్ళి దాన్ని వెల్డింగ్ చేయించుకుని తిరిగి తీసుకు వచ్చి, తన గేటును అమర్చుకోవాల్సి వుంటుంది. ఈ గేటు తీయటానికి ఇరువైలా వున్న గోడను కూడా పగల గొట్టాల్సిన అవసరం వస్తే మళ్ళీ అదో ఖర్చు. ఈ మొత్తం పనిలో ప్రధానమైన వెల్డింగ్ చేయటానికి అయ్యే ఖర్చుకన్నా, ఆ గేటును సదరు వెల్డింగ్ షాపు వద్దకు చేర్చటానికి, అక్కడి నుండి దాన్ని మళ్ళీ తీసుకు రావటానికి, దాన్ని సమగ్రంగా బిగించటానికి అయ్యే ఖర్చులే తడిసి మోపెడు అవుతాయి.

రాముడు ఏర్పాటు చేసిన మొబైల్ వెల్డింగ్ వాహనం వల్ల ఈ ఖర్చులేవీ లేకపోగా, సదరు గేటును బయటకు తీయాల్సిన అవసరం లేకుండా ఇంటికే వచ్చి వెల్డింగ్ చేస్తాడు. అంటే ఈ గేటును వెల్డింగ్ షాపు వద్దకు తీసుకు వెళ్ళే ఖర్చుకు అక్కడే వెల్డింగ్ పని పూర్తవుతుంది. దీనివల్ల వినియోగ దారునికి ఎంతో ఖర్చు ఆదా అవుతుంది. అలాగే వెల్డింగ్ చేసే రాముడికి ఉపాధి లభిస్తుంది.

ప్రస్తుతం వ్యవసాయ పనిముట్లు కూడా దాదాపు అన్నీ ఇనుపవే కావటం వల్ల వాటి రిపేర్లను కూడా ఇంటి వద్దకే వెళ్ళి చేయటంతో రైతులకు వాటి రిపేర్ల కోసం ఎక్కడికో వెళ్ళాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ పనులన్నిటితో పాటు, గ్రామీణులకు అవసరమైన షెడ్డు నిర్మాణం లాంటి పనులను కూడా ఇతను చేపట్టడం, వాటికి సంబంధించిన రిపేర్లు చేయటం చేస్తూ వుంటాడు.

ఈ పనులన్నీ చేయటం వల్ల రాముడుకు రోజూ కనీసం వెయ్యి నుండి రెండు వేల రూపాయల వరకు ఉపాధి లభిస్తోంది. చాలాసార్లు

అవసరం వున్న రైతులు ఫోన్ చేస్తే చాలు వారి ఇంటి వద్దకే వెళ్ళి వారికి అవసరమైన రిపేర్లన్నీ చేసి ఇస్తున్నానని, తన జీవనానికి ఎటువంటి ఢోకా లేదని, దాతలు ఎవరైనా సహాయ సహకారాలు అందిస్తే కొంత ఇనుప సామాన్లు కూడా నా బండిలో పెట్టుకుని వెళ్ళ గలిగితే ఇంకా త్వరగా పనులు చేయటం జరుగుతుంది అంటాడు రాముడు. ఒక్కోసారి కొన్ని చిన్న చిన్న ఇనుప ముక్కలు, ఇతర సామాగ్రి అవసరం అవుతుందని, వినియోగ దారుడి వద్దకు వెళ్ళి వారికి చేయాల్సిన పని చూసిన తర్వాత ఏవైనా సామాన్లు అవసరం అయితే వాటిని చూసుకుని సమీప పట్టణానికి వెళ్ళి వాటిని తీసుకుని, మళ్ళీ మరునాడు వెళ్ళి రిపేర్లు చేయాల్సి వస్తోందని, అదే సామాగ్రి నా వెంటనే వున్నట్లయితే వినియోగ దారునికి పని వెంటనే పూర్తి అవుతుంది, ఒకే పనికోసం రెండు మూడు సార్లు వెళ్ళాల్సిన అవసరం ఉండదని అంటాడు.

ఏమీ చదువుకోక పోయినా, తానే స్వయంగా మొబైల్ వెల్డింగ్ షాప్ ఏర్పాటు చేసుకోవటం వల్ల తన ఉపాధితో పాటు, గ్రామాల వారికి కూడా అనవసరపు ఖర్చును తగ్గించి వారి ఇంటి వద్దనే రిపేర్లు చేయటం వల్ల గ్రామీణులకు కూడా ఎంతో ఊరట కలిగిస్తున్న సింగిరెడ్డి రాముడు ఎంతో అభినందనీయుడు. రాముడు స్వయంగా ఆలోచించి, తనకు తానుగా ఉపాధిని కల్పించుకొని విజయవంతంగా కొనసాగిస్తున్నాడు. ఈ ప్రయోగం గ్రామాల్లోని యువతకు ఉపాధిగా బావుంటుంది. దాంతో మరిన్ని గ్రామాల్లోని ప్రజలకు వెల్డింగ్ సౌకర్యం ఇంటిముందుకు చేరిపోతుంది. సమాజంలో ఆనందం పెరుగుతుంది. ఆరోగ్యంగా ఉంటారు. సమాజ సమృద్ధికి దారితీసే అవకాశాలు పెరుగుతాయి. 'పల్లెసృజన' ఇలాంటి ఉపాధి అవకాశాలను గ్రామీణ యువతకు అవగతం చేయటానికి ఒక కొత్త శీర్షికను ప్రారంభించింది. (14వ పేజీ చూడండి) పాఠకులు మేము సూచించిన ఈ ఉపాధి అవకాశాలను గ్రామీణ యువతకు చేరుస్తారని మసారా ఆహ్వానిస్తున్నాం. యువతకు ఇలాంటి ఉపాధి అవకాశాలను సరియైన పద్ధతిలో తెలియజేస్తే గ్రామీణ యువత అంతా తమ కాలాన్ని వృథా చేసుకోకుండా, సమాజానికి ఉపయోగ పడటంతో పాటు, తామూ ఉపాధి పొందిన వారవుతారు.

**ఇన్నోవేటర్ రాముడు, ఫోన్ : 90003 95295**

# వేప పిండి తయారీ యంత్రం చేసి ఇతరులకు ఉపాధి ఇస్తున్న 'అన్నపురెడ్డి రాముడు'

తన సృజనాత్మకతో ఇతరులు కూడా ఉపాధి పొందే యంత్రాన్ని తయారు చేసి ఇచ్చాడు రాముడు. ప్రస్తుతం చాలా మంది రైతులలో సేంద్రియ వ్యవసాయం పట్ల సుముఖత పెరగటం, రసాయన ఎరువుల ధరలు విపరీతంగా పెరగటంతో రైతులలో వేప పిండి, కంపోస్టు ఎరువులు, వర్మీ కంపోస్టు ఎరువులకు గ్రామాల్లో విపరీతమైన గిరాకీ పెరిగింది. ఈ విషయాన్ని గమనించిన ఒక రైతు కోరిక మేరకు వేప గింజలను పిండిగా చేసే యంత్రాన్ని కూడా తయారు చేసి ఇచ్చాడు.

మార్కెట్లో వేప పిండి తయారు చేసే యంత్రం కొనాలంటే లక్షల్లో ఖర్చు అవుతుంది. రైతు కుటుంబాలకు అంత సొమ్ము ఖర్చు చేసి వాటిని ఏర్పాటు చేసుకునే స్థోమత ఉండదు. అందుకే రాముడితో ఆ రైతు వేప పిండి తయారు చేసేలా ఏదైనా యంత్రాన్ని తక్కువ ఖర్చులో చేసి ఇవ్వగలవా అని అడిగాడు. అందుకు రాముడు తప్పకుండా తయారు చేసి ఇస్తాను అని కేవలం 30 వేల రూపాయల ఖర్చుతో ఆ యంత్రాన్ని తయారు చేసి ఇచ్చాడు. ఇప్పుడు దానివల్ల ఆ రైతుకు కొత్త ఉపాధి లభించటంతో పాటు, ఆ గ్రామీణులు, చుట్టు పట్ల గ్రామాల వారికి సమీపంలోనే సేంద్రియ వ్యవసాయానికి అవసరమైన వేప పిండి ఎరువు లభిస్తోంది. ఇందుకు అవసరమైన వేప గింజలను మార్కెట్‌లో కొనుగోలు చేసి అందులో నుండి నూనెను వేరు చేయకుండా నూనెతో కలిసి వున్న వేప పిండిని రైతులకు అందిస్తున్నాడు. ఇలా వేప పిండిలో వేపనూనె తియ్యకుండా ఉన్నది కావటంతో పంటలకు ఎరువుతో పాటు, పంటలు కూడా చాలా వరకు పురుగుల బారిన పడకుండా ఆరోగ్యంగా పెరుగుతున్నాయి.



సాధారణంగా చాలా మంది రైతులు వేపనూనె కర్మాగారాలకు వెళ్ళి అక్కడి నుండి వేపనూనె తీసిన పిప్పి (వేప చెక్క అంటారు) కొనుగోలు చేసి దాన్ని మెత్తటి పొడిగా చేసి, పంటలకు ఎరువుగా వేస్తారు. ఇలా చేయాలి అంటే వేప చెక్కను పొడిగా చేసుకునేందుకు కూడా అదనంగా ఖర్చు అవుతుంది, పైగా ఇది కేవలం ఎరువుగా మాత్రమే ఉపయోగ పడుతుంది. వేపనూనె వేరు చెయ్యని వేప పిండిని ఎరువుగా వాడటం వల్ల రెండు విధాలుగా లాభాలు రైతుకు లభిస్తాయి. అందుకే ఇటువంటి వేప పిండికి గిరాకీ ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి వేప పిండి తయారు చేసే యంత్రాలు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకో గలిగితే అన్ని గ్రామాలు సేంద్రియం వైపుకు మళ్ళటమే కాక, రసాయన ఎరువుల వినియోగం కూడా తగ్గి, సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించిన వాళ్ళము అవుతాము.




# 'పల్లెసృజన' ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలో 38వ చిన్న శోధయాత్ర

బ్రిగేడియర్ పోగుల గణేశం గారి ఆధ్వర్యంలో ప్రారంభించిన 'పల్లెసృజన' 38వ శోధయాత్ర ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లాలో గల 'కొండమ నాయని పాల్యం నుండి కనిశెట్టి పల్లి' వరకు అక్టోబర్ 1 నుండి 3వ తేది వరకు నిర్వహించ బడింది. ఈ కార్యక్రమానికి వివిధ వర్గాలకు చెందిన నిష్ణాతులు, రైతులు, మహిళలు, పిల్లలు, విద్యార్థులు, యువతీ యువకులు అందరూ స్వచ్ఛందంగా పాల్గొని యాత్రకు నిండుదనం చేకూర్చి, జ్ఞాన వికాసాన్ని పొందారు.

పల్లెసృజన శోధయాత్ర ద్వారా పల్లెల ప్రకృతి అనగా పంట పొలాలు, కొండలు, గుట్టలు, అడవి, నదులు, చెరువులు, నీటి కుంటలు, వ్యవసాయ భూములు, వివిధ పంటలకు నీటి పారుదల వ్యవస్థను, రైతులు, రైతు కూలీల శ్రమజీవన విధానమును మరియు చేతివృత్తుల వారియొక్క కుటీర పరిశ్రమలు, జీవన విధానమునకు వారి వారి వృత్తులలో సహాయపడు సాంప్రదాయ సాంకేతికతలను మరియు ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేని పల్లెవాసులు కనిపెట్టిన ముఖ్యమైన పరికరాల రూపకల్పనను, పని విధానమును ప్రత్యక్షంగా చూడటం ద్వారా పల్లెల సాంకేతిక పరిజ్ఞానము అవసరాలను తెలుసుకోవటం, పల్లెసృజన శోధయాత్ర ద్వారా సాధ్యపడింది. అదేవిధంగా వారి జీవన విధానం, సాంప్రదాయం, సంస్కృతి, ఆహారపు అలవాట్లు, వస్త్రాలు, ఆభరణాలు, గృహ వైద్యాలు, వివిధ రకాల ఆహారముల తయారీ విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించ గలిగారు. పల్లెసృజన శోధయాత్ర ద్వారా పల్లెల యొక్క సామాజిక, రాజకీయ, ఆర్థిక, సంస్కృతులను ప్రత్యక్షంగా యాత్రికులు పరిశీలించడం జరిగింది.

గ్రామీణులతో చర్చలలో వారి అనుభవాలను వ్యక్తీకరించటం, వినటం ద్వారా పల్లెల స్వరూప స్వభావాలు మనస్సులు, పరిష్కారాలు తెలుసుకోవచ్చు. పల్లెల సృజనాత్మకతను ప్రోత్సహించి, సన్మానించటం ద్వారా పల్లెల ప్రగతికి 'పల్లెసృజన' వారి శోధయాత్ర ఎంతో తోడ్పడుతుంది.

ఈ శోధయాత్ర ద్వారా పల్లె ప్రజలే కాక, పరిసరాలను తెలుసుకోవటం, ఆవులు, ఎద్దులు, గాడిదలు, కోళ్ళు, మేకలు, గొర్రెలు, కుక్కలు, పక్షులు మొదలైనవి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఏవిధంగా తోడ్పడుచున్నవి, వాటి ఆలనా పాలనా వైద్యం మొదలైనవి గ్రామాలను పరిశీలించటం ద్వారా మాత్రమే తెలుస్తుంది. వీటి ప్రగతికి కూడా ఈ శోధయాత్ర ఎంతగానో తోడ్పడుతోంది. అదేవిధంగా సమాజంలోని పెద్దలు, పిల్లలు, మహిళలు, యువతీ యువకులు, విద్య, వైద్యం, లక్షణాలు, మానవ సంబంధాలు, ప్రస్తుత కుటుంబ వ్యవస్థ మొదలగు వాటిని పల్లెసృజన శోధయాత్రల ద్వారా పరిశీలించవచ్చు.

గ్రామీణ ప్రాంతాలలోని వివిధ ప్రదేశాలలో అంటే నది లోయ పల్లెలు, కొండ ప్రాంత పల్లెలు, తీర ప్రాంత పల్లెలు, పట్టణ ప్రాంత పల్లెలు, ఎత్తయిన పర్వత ప్రాంత పల్లెలు.... ఇలా ఒక్కో ప్రాంతం పద్ధతులు ఒక్కో రకంగా ఉంటాయి. వాటన్నిటిని కూలంకషంగా గమనించటం శోధయాత్ర ద్వారా సాధ్యం. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన వర్షపాతం, ఆయా ప్రాంతాల్లో నీటి పారుదల సౌకర్యాలు, గ్రామీణ పరిశ్రమలు... ఇలా అనేక రకాల వైవిధ్యత కలిగిన గ్రామాలను, వారి ఆహారపు అలవాట్లు, వారి భాష, యాస ఇలా ఎన్నో గమనించటం



జరుగుతుంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన వ్యవసాయ పద్ధతులు, వస్త్రాలంకరణ, విభిన్న ఆర్థిక పరిస్థితులు... ఇలా ఎన్నింటినో గమనించి వారి అభిప్రాయాలను పంచుకోవటం వల్ల శోధ యాత్రీకులు సమగ్ర జీవన లక్ష్యాలను నిర్ధారించుకునే అవకాశం ఉంటుంది. మానవతా విలువలను రక్షించుటకు, తమయొక్క కృషిని, సహకారాన్ని, సేవను స్వచ్ఛందంగా అందరికీ పంచడం జరుగుతుంది. ఈ శోధయాత్ర వల్ల యాత్రీకులు భవిష్యత్‌లో సమసమాజ నిర్మాణానికి తోడ్పడుతారని అనిపిస్తుంది. ఈ స్వచ్ఛంద కార్యకర్తలు జ్ఞాన వికాసాన్ని, ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక, ఆధ్యాత్మికతలను ప్రత్యక్ష పరిశీలన ద్వారా అనుభవంలోకి వస్తుంది. భారతదేశ ప్రగతి పల్లెల పైనే ఆధారపడి వుంది అని ప్రతి ఒక్కరూ గమనించే అవకాశం ఉన్నది.

ఈ శోధయాత్రల వలన భారత సమాజ మూలాలు తెలుస్తాయి. వాటి ప్రగతిపై అందరికీ అవగాహన ఏర్పడుతుంది. సమస్యలను అభివృద్ధికి ఆటంక పరచకుండా పరిష్కరించి సమాజ ప్రగతికి తోడ్పడే అవకాశం వుంటుంది అని ఈ యాత్ర నాకు తెలియజేసింది.

**– మద్దినేని వెంకటేశ్వర రావు**, కోదాడ, 'పల్లెసృజన' స్వచ్ఛంద కార్యకర్త,

నాకు అత్యంత అవసరమైనప్పుడు చిన్న శోధయాత్ర నాకు అవసరమైన విజయాన్ని అందిస్తుంది. ఈ 38వ శోధయాత్ర కూడా అనేక అనుభూతులను అనూహ్యంగా నాలో మిగిల్చింది. నేనెప్పుడూ చూడని అనేక విధాలుగా నన్ను ఆశ్చర్య పరిచింది. అందమైన బంతిపూల తోటలు, నక్షత్రాలతో నిండిన ఆకాశం క్రింద నా చేతిలోకి దిగిన తుమ్మెద ఆ అనుభూమిని ఏవిధంగా వర్ణించను. ఈ యాత్ర వల్ల నేనెన్నో విషయాలను స్వయంగా నేర్చుకున్నాను. నేకేమి కావాలో, నా సహ యాత్రీకులు ఏమి కోరుతున్నారో తెలిసింది. ఇది కేవలం చిన్న శోధయాత్ర ఇచ్చే స్వేచ్ఛ వల్ల సంభవమైంది.

చిన్న శోధయాత్ర అనేది ఒక అనుభూతి. హృదయాలు విప్పి మాట్లాడుకోవటాలు, నేర్చుకోవడాలు, ఎక్కడో విన్న వాటిని ప్రత్యక్షంగా గమనించడాలు ఇలా ఎన్నో.... ఈ యాత్ర మనసు పరిధులను విస్తృతం చేస్తుంది. చాలా అద్భుతమైన వ్యక్తులను కలుసుకున్నాను. ఈ యాత్రకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఒక పుస్తకంలా అనిపిస్తారు. అందుకే మరోసారి యాత్ర చేయాలనిపించింది. ఈ యాత్రలో వేమవో ఆవిష్కర్తను కనుగొన్నాము. ఆవిష్కర్తతో బ్రిగేడియర్ గారి సంభాషణకు సాక్ష్యంగా ఉండటం కూడా నాకు చెప్పలేనంత అనుభూతి. గ్రామంలోని పిల్లల నుండి మేము పొందిన ప్రేమ చాలా స్వచ్ఛమైనది. వీరి ప్రేమ ఎంత





విలువైందో అని ఆశ్చర్యం వేస్తుంది. ఒక్కసారి ఈ శోధయాత్రలో పాల్గొంటే ఉన్నత విలువలు తప్పక అవలర్చుకుంటాము. యాత్ర మళ్ళీ మళ్ళీ చేయాలనిపిస్తుంది. **– నిలయ,** హైదరాబాద్.

ప్రతి చిన్నశోధయాత్ర ఒక జీవితకాల జ్ఞాపకాలను మిగిలిస్తుంది. ఈసారి జరిగిన 38వ యాత్రలో పది సంవత్సరాల కన్నా తక్కువ, 70 సంవత్సరాలకు పైబడ్డ వయసు వారితో నడవటం ఒక అద్భుతమైన అనుభవం. ప్రతి యాత్ర సమాజ శ్రేయస్సుకు ఉపయోగ పడే నైపుణ్యాన్ని తెలియజేస్తుంది. ఈ యాత్రలో పాల్గొనే ప్రతి వ్యక్తి ఒక పుస్తకం. యాత్రలో పాల్గొంటే చాలు మనం లైబ్రరీకి వెళ్ళి ఎన్నో పుస్తకాలను చదివిన జ్ఞానం వస్తుంది. ప్రతి పుస్తకానికి ఒక ప్రాముఖ్యత ఉంటుంది. యాత్రలో ప్రతి క్షణం విలువైందే. ప్రకృతి, ప్రజల అనుభవాలతో, సంభాషణలతో పూర్తి ఆనందాన్ని పొందాను. వాస్తవ సమస్యలను తెలుసుకోవడానికి అవసరమైన మైక్రో స్థాయిలో విషయాలను ఎలా గమనించాలో నేర్చుకున్నాను. వేగవంతమైన ఈ ప్రపంచంలో, సాంకేతిక ఆవిష్కరణల యుగంలో 'పునాది స్థాయి ఆవిష్కరణల'కు పెద్దయెత్తున మద్దతు అవసరం. తద్వారా వారికి, అవసరమైన ఎంతో మంది జీవితాలపై స్పష్టమైన ప్రభావం వుంటుంది.

ఎంతో సహనంతో, జీవితంలోని సమస్యలను ఎదుర్కొనే వాటికి పరిష్కారంగా ఆవిష్కరణలు చెయ్యటం ఒక యెత్తయితే, వాటిని సమాజానికి అందేలా మార్కెట్ చెయ్యటం మరో యెత్తు. వీటి తయారీ, మార్కెటింగ్ కొరకు ఒక నిధిని ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ఇది కేవలం ఒక సూచన మాత్రమే. కానీ అత్యవసరం. పల్లెసృజన వాలంటీర్లు కూడా ఈ నిధి సేకరణకు విశేషంగా కృషి చేయ గలిగితే పునాది స్థాయి ఆవిష్కర్తలకు ఎంతో మద్దతుగా, ఉపయోగ కరంగా ఉంటుంది. **– ప్రవీణ్ కుమార్ రెడ్డి,** అనంతపురం.

నేను జీవితకాల శోధ యాత్రికుడిగా ఉండాలి అనుకుంటున్నాను. అంటే జీవితాంతం నేర్చుకునే అవకాశం ఉంటుంది కదా. ఈ యాత్ర కూడా ఇతర యాత్రల మాదిరిగానే ఓ ప్రత్యేకమైన అనుభూతి నాలో మిగిల్చింది. నా మొట్టమొదటి శోధయాత్ర 'ప్రపంచం సాధారణ స్థితికి చేరుకుంది' అనిపించింది. యాత్రలో అపరిచితులతో పరిచయం, ఎటువంటి సంకోచాలు ఉండవు, అన్నీ అంగీకారాలే. పిల్లలను పాఠశాలల్లో చూడటం, వారి శబ్దాలు ఆత్మ తృప్తిగా అనిపిస్తాయి. ఎక్కడెక్కడో నీళ్ళు త్రాగుతాము, గ్రామీణులు మాకు అందించే టీ, కాఫీ,



భోజనాలు, వారి ముఖాల్లో ఆ సమయంలో కనిపించే సంతోషం చూస్తుంటే ఈ అనుభవాలను నగరాలు ఎప్పుడో కోల్పోయాయి అనిపిస్తుంది. కానీ కేవలం మనిషి మాత్రమే ఈ నిజమైన ప్రేమను అనుభవించ గలడు అనిపిస్తుంది.

జ్ఞానం అనేది చిన్న పిల్లల నుండి వయో వృద్ధుల వరకు ఎవ్వరికైనా ఉంటుంది అని తెలిసింది. సహ యాత్రీకులు, ఆవిష్కర్తలు మరియు గ్రామస్తులు చెప్పే స్ఫూర్తిదాయకమైన కథలు వినడం నాకు చాలా ఇష్టం.

చివరగా నేను చెప్పేదేమంటే ఈ యాత్రలో పాల్గొనటం అంటే మీతో మీరు 'డేటింగ్' లాంటిది. మీతో మీ సమయాన్ని గడపవచ్చు. ఒక్కసారి యాత్రలో పాల్గొన్న వారు మళ్ళీ మళ్ళీ ఇలాంటి యాత్రల్లో పాల్గొనాలి అనుకుంటారు. **– ఓంకార్,** హైదరాబాద్.

మేము యాత్రను ప్రారంభించడానికి ముందు నేను అందరితో నాకు గ్రామీణాభివృద్ధిపై చాలా ఆసక్తి కలిగి ఉన్నానని, అందుకే గ్రామాల సందర్శన కొరకు ఈ యాత్రకు వచ్చానని చెప్పాను. గ్రామాలకు వెళ్ళటం ఇది మొదటిసారి కాదు కానీ, గ్రామల గుండా నడవటం, వారితో మమేకమై జీవించటం ఇదే మొదటిసారి.

యాత్రలో జరిగిన ఒక చర్చ గురించి నేను ఇప్పటికీ ఆలోచిస్తు న్నాను. వ్యవస్థ నుండి సంపూర్ణ మద్దతు లేక 'చేనేత పనివారి కోసం రూపొందించ బడిన ఒక గొప్ప ఆవిష్కరణ వారిని చేరుకోవటానికి ఎంత సమయం తీసుకుందో గణేశం గారు చెబితే తెలిసింది. ప్రజలకు సేవ చేయడానికి నిర్మించిన వ్యవస్థ, ఆవిష్కర్తకు మద్దతు ఇవ్వక పోవడం హాస్యాస్పదం అనిపించింది'.

అప్పుడు తెలిసింది, మేము ఇలాంటి సమస్య వస్తే ఎలా పరిష్కరించాలి? అని. మొత్తం వ్యవస్థను మార్చగలమో లేదో కాని, విద్యార్థులలో మనస్తత్వం, విలువలు పెంపొందించటానికి నేను ప్రత్యేకం గా ఒక చర్చను మా కళాశాలలో ప్రారంభించ గలనని అనుకుంటు న్నాను. భవిష్యత్తులో విద్యార్థులంతా పెట్టుబడిదారీ విధానం నుండే కాదు, సోషలిస్టు భావాల నుండి కూడా నిర్ణయాలు తీసుకోవాలి అనుకుంటున్నాను.

యాత్రలో పాఠశాలవిద్యార్థులు సమస్యలను వినడం, వాటి పరిష్కారాలు ఆలోచించటం, ఆవిష్కరించడం లాంటి వాటిని పెంపొం దించటం లాంటి బాధ్యత తప్పకుండా మనపై ఉంది అని గట్టిగా నమ్ముతున్నాను. ఈ అనుభవాలు భవిష్యత్తులో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడి భవిష్యత్ తరాలపై ఎంతో ప్రభావితం చూపుతాయి అనుకుంటున్నాను. ప్రపంచాన్ని మంచి ప్రదేశంగా మార్చడానికి సమిష్టి ప్రయత్నాలు మరియు నిర్ణయాలు తీసుకోవడంపైనే మనమంతా దృష్టి పెట్టాలి.

ఏదేమైనా నిర్ణయం కీలకం. సమాజంతో నిమగ్నం కావడానికి సత్సంబంధాలను ఏర్పరచుకోవడానికి 'కమ్యూనిటీ ఆధారిత అభ్యాస కోర్సు'లతో ముందడుగు వెయ్యాలని నేను ఇప్పుడు ఆలోచిస్తున్నాను. యాత్రలో చాలా సరదాగా గడిపాను కాబట్టి నా తోటి యాత్రీకులు కూడా ఇలాంటి ఆలోచనలే చెయ్యాలని, మున్ముందు విద్యార్థులంతా ఇలాంటి యాత్రల్లో తప్పక పాల్గొనాలని సూచిస్తాను. **– రోహిత్,** హైదరాబాద్.

'చిన్న శోధయాత్ర' పేరుతో 'చిన్న' అని ఉన్నా, ఈ యాత్ర ద్వారా శోధించేది, సాధించేది చాలానే ఉంది. ఈ యాత్ర ద్వారా నేను బాహ్య ప్రపంచమైన గ్రామాల్లో నడుచుకుంటూ తిరగడమే కాక, అంతర్లీనంగా నన్ను నేను తెలుసుకుంటూ ఉన్నాను. నాకు నచ్చినట్టుగా ఆ మూడు రోజులు పూర్తి స్వేచ్ఛా జీవితాన్ని గడప గలిగాను.

నేను ఇప్పటి వరకు నాలుగు చిన్న శోధయాత్రలకు వెళ్ళాను కానీ ఈ 38వ చిన్న శోధయాత్ర నా రెండవ సంపూర్ణ యాత్రగానే భావిస్తాను. ప్రతి యాత్ర జీవితంలోని కొన్ని మధుర జ్ఞాపకాలను మిగిల్చింది.

మొదటి రోజు నా యాత్ర 'పల్లెసృజన' కార్యాలయ ప్రాంగణం నుండే మొదలైంది. యాత్రలో బ్రిగేడియర్ గారితో ప్రయాణం అంటే నేర్చుకోవడానికి ఎక్కువ విషయాలే ఉంటాయి కదా!

ఈ ప్రయాణంలో యాత్ర ప్రారంభమైన 'కొండమనాయని పాల్యం'కి చేరే క్రమంలో దారి పొడవునా వచ్చే గ్రామాల ఉదయపు అందాలు చూపు తిప్పుకోకుండా చేశాయి. ఇదే కదా జీవం ఉట్టిపడే జీవన విధానం అని వర్ణించకుండా ఉండలేను. పల్లె పచ్చిక పైరుల సోయగాలు ఆస్వాదించే అదృష్టం యాత్రలో అదనపు అవకాశమే కదా!

యాత్ర ప్రారంభానికి ముందు ఎవరెవరు ఏ నేపథ్యం నుండి వస్తున్నారో, వాళ్ళనుండి కొత్తగా ఏమైనా నేర్చుకోగలగాలి అనే కోరిక వెరసి మొత్తానికి ఈ యాత్ర ఎలా అందబోతుంది అనే ఆలోచనలతో ఒక మేథోమథనం మొదలైందని చెప్పవచ్చు.

యాత్రలో కొన్ని సంఘటనలు..... వయోవృద్ధుడైన ఖాదర్ గారు వారి అనుభవాలను మనతో పంచుకోవటం, అప్పటి కాలమే బాగుంది అని అతను చెప్పే మాటలు వింటుంటే, "అసలు మానవ సమాజం సాధించిన అభివృద్ధి ఎందుకోసం?" అనే ప్రశ్న రాకుండా ఉండదు. అక్కడక్కడా నీరు లేకుండా జీవం కోల్పోయినట్టుగా ఉన్న నీటి బావులను చూస్తే చాలా బాధేసింది. యాత్రలో ప్రకృతిలో మనకు తెలియని వివిధ మొక్కలను గురించి వాటి ఉపయోగాలను గురించి తెలిసిన అనుభవజ్ఞుడైన అంజిరెడ్డిగారి మాటలు వింటుంటే వారి సహకారంతో మొక్కలు అన్నిటి గురించి తెలుసుకోవాలనే అభిలాష ద్విగుణీకృతం అయ్యింది.



గ్రామాల్లో ఉండే పెద్ద పెద్ద వృక్షాలు, వాటిచుట్టూ కూర్చోవడానికి గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న అరుగులు చూడ ముచ్చటగా ఉన్నాయి. అవేకదా పల్లె ప్రజలతో వృక్షాలకు ఉన్న అనుబంధానికి ప్రతీకలు.

చాలా సంవత్సరాల తర్వాత పల్లెలోని ఒక ప్రభుత్వ పాఠశాలకు వెళ్ళిన అనుభూతి బాగుంది. అక్కడ పిల్లలతో గణేశం గారు దేశంలోని వివిధ ప్రాంతాలలో విద్యార్థులు గమనించిన సమస్యలకు వాళ్లే పరిష్కారాలు కనుక్కొని చేసిన ఆలోచనలు, ఆవిష్కరణలు ఇక్కడ పాఠశాల విద్యార్థులకు తెలియజేసి, వారిలోనూ వాళ్ళ రోజువారి సమస్యలకు పరిష్కారాలు కనుక్కోమని చేయించిన ప్రయత్నం బాగుంది. ఇంకా ఎన్నెన్నో సమాజ హితం కోసం, ఆశయంతో చేసిన ఎన్నో గొప్ప వారి కథలతో మొత్తానికి నా జీవితంలో ఈ యాత్ర సంతృప్తికరంగా ముగిసింది.

**- భరత్**, హైదరాబాద్.

నా 38వ 'చిన్న శోధ యాత్ర' అత్యుత్తమ నడక, గ్రామాల ప్రకృతి, ప్రశాంతత, గ్రామాల వైభవం, గ్రామస్తుల ఔదార్యం, అద్భుతమైన ఆవిష్కర్తలు మరియు యాత్రికుల స్ఫూర్తితో సాగింది. 'సౌకర్యవంతం' అనుకునే చట్రం నుండి నెట్టబడి నా చురుకుదనాన్ని నేను కనుగొన్నాను అనిపించింది. నిశ్శబ్ద వాతావరణంలో నడిచే నడకలో నా ఆత్మ నైపుణ్యం విన్నాను అనిపించింది. నా మనస్సుకు స్పృహ వచ్చింది అనిపించింది. ఎంతో కాలంగా మబ్బుగా వున్న నా





కళ్ళకు కాంతి కనిపించింది. నేను కోరుకున్నది నాకు లభించింది అన్న అభిప్రాయం కలిగింది. నేను నిజంగా బ్రిగేడియర్ గారి అచంచలమైన సంకల్పం, గాంధీ విలువలు, సమగ్ర దృష్టి, క్రమశిక్షణ లాంటి ఎన్నో ప్రేరణలు పొందాను.

గ్రామాలను అనుసంధానించడం, అద్భుతాలను ఆవిష్కరించడం, ఆవిష్కర్తలను ప్రోత్సహించడం, గ్రామీణ పారిశ్రామికవేత్తలను తయారు చేయడం, గ్రామాలను స్వయం సమృద్ధి వైపు పయనింపజేయటం లాంటి ఎన్నో విషయాలను బ్రిగేడియర్ లాంటి గొప్ప నాయకత్వంలో నేర్చుకోవడం జరిగింది. స్వచ్ఛంద సేవకుల కళ్ళల్లో ఆనందం స్పష్టంగా కనబడింది. ఒక సూత్రం నన్ను బాగా ఆకట్టుకుంది "చేపల కూర పెట్టడం కాదు, చేపలు పట్టి తన కూర తానే తయారు చేసుకునే విధానం నేర్పాలి" అన్నది.

పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, సాంప్రదాయ వైద్యులు, రైతులు, మహిళలు మరియు వ్యాపారులతో మా పరస్పర సంభాషణ నాకెన్నో నేర్పింది. మాలాంటి అపరిచితులతో వారి ఆహ్లాదకరమైన కలుపుగోలుతనం, గుర్తింపుకు నోచుకోని ఇన్నోవేటర్ల వినయం ఏమని వర్ణించను. బ్రిగేడియర్ గారు చెప్పినట్టుల ఆవిష్కర్తల సవాళ్ళు మాలాంటి విద్యార్థుల ద్వారా పరిష్కరించ బడాలి.

భవిష్యత్‌లో జరిగే యాత్రలలో నేను పాల్గొనడానికై ఎదురు చూస్తున్నాను. 'పల్లెసృజన' తో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరూ దే● పురోగతినే కాంక్షిస్తున్నారు. ప్రేమతో......

## ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలి అన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 400/–లతో 2సంవత్సరాల పాటు తమ గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటం, సంతృప్తి కలగటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది. ఈ ప్రయత్నం వల్ల తెలుగు రాష్ట్రాలలోని 30 వేల గ్రామాలకు త్వరలో 'పల్లెసృజన' చేరుతుందని, సామాన్య ప్రజల మధ్య సమానాంతర సంభాషణలు ప్రారంభమై, వారిని మరింత ప్రభావితం చేస్తాయని 'పల్లెసృజన' మనసారా ఆశిస్తోంది. -ఎడిటర్

**పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి - 'పల్లెసృజన'ను బహూకరిచండి!** **మీ గ్రామానికి మీరిచ్చే అత్యుత్తమ బహుమతి 'పల్లెసృజన'**



సందర్భం ఏదైనా ఆచారం, సాంప్రదాయం ప్రకారం ప్రతి సందర్భంలో ఓ బహుమతి ఇస్తూ వుంటారు. దానికెంత ఖర్చు చేయాలి? అసలు బహుమతి ఏమివ్వాలి? అన్నవి ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటారు.

❀ ఇచ్చిన బహుమతి ఆ సందర్భంలోనే ఆనందాన్ని పంచేదిగా కాకుండా

❀ అందరూ ఇచ్చిన దానికన్నా భిన్నంగా.... ❀ జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పంచేది, పెంచేదిగా ఉండాలంటే.....?

బహుమతి ఇచ్చిన వారికే కాక, తీసుకున్న వారితో పాటు, నలుగురికీ పనికి వచ్చే విధంగా ఉండాలి. 'పల్లెసృజన' పత్రిక మన పల్లెల్లో మారుమూల ప్రాంతాల్లో దాగివున్న విజ్ఞాన సంపదను వెలికి తీసి, ప్రస్తుత నవ సమాజానికి ఉపయోగపడే విధంగా చేయటానికి పాటు పడుతుంది.

**'పల్లెసృజన' చందా వివరాలు ఈ పత్రిక చివరి పేజీలో ఉంటాయి**

# గ్రామీణ యువత స్వయం ఉపాధే లక్ష్యంగా 'పునాది స్థాయి ఇన్నోవేషన్లు'



- జమ్మలమడక శశిమోహన్

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 73 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో ఈ సంచిక నుంచి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

– ఎడిటర్.

## గ్రామాల్లో తగ్గిపోతున్న హమాలీల కొరత తీర్చేందుకు
## నిర్వహణా ఖర్చులు లేని ట్రాక్టర్ క్రేన్‌తో ఉపాధి

పూర్వం గ్రామాల్లో పంటల నూర్పిడి సమయం వచ్చిందంటే చాలు రైతుల కళ్ళాలు ధాన్యపు సిరితో కళకళలాడుతూ ఉండేవి. వరి ధాన్యం నూర్పిడి చేసేందుకు వరిగడ్డి కొట్టే కూలీలు, జొన్నలు నూర్పిడి చేసేందుకు పెద్ద పెద్ద గుండ్లను వేసుకుని, జొన్న కంకులపై రెండు మూడు కాండ్ల ఎద్దులతో గుండ్రంగా తిరుగుతూ వున్న హడావిడి, తూర్పు పోసే వారు, ధాన్యం ఆరబెట్టేవాళ్ళు... ఇలా పండుగ వాతావరణమే ఉండేది. ఇప్పుడు ఈ హడావిడి అంతా పోయి, అన్ని ధాన్యాల నూర్పిడికి యంత్రాలు వచ్చేశాయి. పంట కళ్ళానికి రావాల్సిన అవసరం లేకుండా పొలంలోకే యంత్రాలు వెళ్ళి అక్కడే నూర్పిడి, తూర్పు ఒకేసారి జరిగి పోయి ధాన్యం నేరుగా సంచుల్లోకి వచ్చి చేరుతోంది.

ఇలా ధాన్యం సంచుల్లోకి చేరుతుందే కానీ, వాటిని తిరిగి ఇంటికి చేర్చడం లేదా ఆ ధాన్యాన్ని ఆరబోయటానికి గ్రామంలోని ఒక విశాల ప్రదేశానికి చేర్చటం, మళ్ళీ ధాన్యం ఆరిన తర్వాత సంచులకు నింపి నేరుగా ఇంటికో లేదా మార్కెట్‌కో తరళించే పని మాత్రం ఇప్పటికీ జరుగుతునే ఉంది. కానీ, ఇక్కడే ఒక సమస్య వచ్చి పడింది రైతాంగానికి. పూర్వం చాలామంది కూలీలు బక్క పలచగా వున్నా ఎంతో శరీర దృఢత్వంతో వుండి 50 కిలోల ధాన్యం మూటను కూడా సునాయాసంగా



ఎత్తి ఎద్దుల బండి లేదా ట్రాక్టర్‌పై వేసేవారు. ఇప్పుడు అలా ధాన్యం మూటలను ఎత్తి వాహనాల్లో వేసే శారీరక దృఢత్వం కలిగిన కూలీల సంఖ్య నాటి నుండి నేటికి 1–2 శాతానికి పడిపోయింది. వారు కూడా విపరీతమైన ఒళ్ళు నొప్పులను భరించలేక ఈ పని మానేసి ఇతర మార్గాలు చూసుకుంటున్నారు. అక్కడక్కడా కొంతమంది ఉన్నా, వారి కూలీల ఖర్చు కూడా రైతుకు తడిసి మోపెడవుతోంది. స్వయంగా ధాన్యం మూటలు ఎత్తుకోలేక, కూలీల ఖర్చును భరించలేక సతమతం అవుతున్నారు సన్న, చిన్నకారు రైతులు.

అలాగే ఏవైనా బరువైన యంత్రాలు, వస్తువులు గ్రామాలకు తీసుకు వస్తే వాటిని దింపేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలకు గురి అవ్వాల్సి వస్తోంది గ్రామీణులకు. పట్టణాల్లో ఎన్నో రకాల గిడ్డంగుల వద్ద హమాలీల లేమి కారణంగా లారీలకు అనుకున్న సమయంలో లోడు కాక, లారీల యజమానులు, సరుకు యజమానులు, గిడ్డంగి సిబ్బంది ఎంతో ఆవేదనకు గురవుతున్నారు. ఒక్కో గిడ్డంగి వద్ద ఈ క్రేన్‌తో సిద్ధంగా వున్నట్లయితే అందరు సంతోషంగా వుండటంతో పాటు, యువతకు ఉపాధి కూడా లభిస్తుంది.

ఈ సమస్యలన్నిటిని తీర్చేందుకు ఒక సులువైన, ఎటువంటి నిర్వహణా ఖర్చు లేని పరికరాన్ని తయారు చేశాడు హనుమకొండ జిల్లా పర్కాలకు చెందిన ఇన్నోవేటర్ 'కడివెండి మహిపాల్ చారి'. ఈ పరికరాన్ని ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకోవాల్సి వుంటుంది. ఈ పరికరం ద్వారా కేవలం ముగ్గురు అంటే ట్రాక్టరు డ్రైవరు, రైతు, మరో కూలీ లేదా రైతు కుటుంబ సభ్యులు ఉంటే చాలు. ఎంతటి బరువైన ధాన్యపు మూటలు లేదా బరువైన ఏ యంత్రాలు, వస్తువులను ఐనా సరే ట్రాక్టర్‌లోకి ఎత్తటం, దించటం సులభంగా తక్కువ ఖర్చుతో చేసుకోవచ్చు.

**ట్రాక్టర్‌కు ధాన్యం, బరువులు ఎత్తడం లేదా దించడం:**

ధాన్యం బస్తాలకు అతి సమీపంలో ట్రాక్టర్ ట్రాలీని ఉంచి, ట్రాక్టర్ ఇంజన్ వెనక భాగంలో ఈ క్రేన్ అనుసంధానం చేసుకుంటాడు డ్రైవర్. మొదట ధాన్యం బస్తాలు నెట్టు వేసిన వద్దకు వస్తాడు అక్కడ వున్న రైతు ఆ క్రేన్‌కు వున్న తాడును బస్తాకు చుట్టి పెడతాడు. డ్రైవర్ దాన్ని క్రేన్ సహాయంతో తీసుకు వెళ్ళి ట్రాక్టర్ ట్రాలీలో దించుతాడు. అక్కడ ట్రాలీలో వున్న మరో వ్యక్తి ధాన్యం బస్తాకు వున్న తాడును తీసివేసి బస్తా ఎక్కడ నెట్టు వేయాలో అక్కడ సర్దుతూ వుంటాడు. ఈ మొత్తం పనికి సాధారణంగా పది మంది హమాలీలు ఎంతో శారీరక శ్రమతో చేయాల్సిన పని కేవలం ముగ్గురు వ్యక్తులు ఎటువంటి అలుపు లేకుండా పూర్తి చేస్తారు. ఇక్కడ ముగ్గురు వ్యక్తులు లేనిచోట కేవలం ఇద్దరు అంటే రైతు ట్రాక్టర్





డ్రైవర్ కూడా చేసుకోవచ్చు. కాకపోతే క్రింద ధాన్యం మూటకు తాడును కట్టే వ్యక్తే మళ్ళీ ట్రాలీలోకి ఎక్కి ఆ ధాన్యపు మూటను దించుకుంటాడు. తక్కువ బస్తాలు వున్నచోట, చిన్న, సన్నకారు రైతులు ఇలా చేసుకోవచ్చు. ట్రాక్టరు పైకి ధాన్యపు బస్తాలు, ఇతర బరువైన వస్తువులను ఎంత సులభంగా చేర్చవచ్చో తెలుసింది కదా, అలాగే దించటం కూడా సులువు అవుతుంది.

ఇక్కడ గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి ఏమింటంటే, ఈ క్రేన్‌ను ట్రాక్టర్ వున్న యువకులు కొనుగోలు చేసినట్లయితే మీ గ్రామంతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలలో కూడా బరువులు, ఎత్తే, దించే పనులను ఎటువంటి కూలీల ఖర్చు లేకుండా రైతుకు మేలు చేయటంతో పాటు, మీరూ ఉపాధి పొందవచ్చు. ప్రస్తుతం ఒక్కో ప్రాంతాన్ని బట్టి ఒక బస్తా ధాన్యం ఎత్తాలన్నా, దించాలన్నా (లోడ్ అన్‌లోడ్) ఒక్కో బస్తాకు 5 నుండి 8 రూపాయల కూలీ తీసుకుంటున్నారు. అదే ట్రాక్టర్ కలిగిన యువకులు ఈ పరికరం ఏర్పాటు చేసుకోవటం ద్వారా ఒక్కో బస్తాకు రెండు లేదా మూడు రూపాయలు తీసుకున్నా రైతు ఆనందంగా ఇస్తాడు. ఎందుకంటే ఇందుకు అయ్యే పదిమంది కూలీల ఖర్చుకన్నా మీకు అయ్యే ఖర్చు తక్కువ, పదిమందిని ప్రోగు చేసే పనికన్నా, మిమ్మల్ని ఒక్కర్నే ఏర్పాటు చేసుకోవటం సులభం, పైగా పని త్వరగా, అలుపు లేకుండా అయిపోతుంది.

పట్టణాలు, నగరాల్లోని నిరుద్యోగ యువతీ యువకులు కూడా ఈ క్రేన్ ఏర్పాటు చేసుకుని గోడౌన్ల వద్ద ఉంటే చాలు, వారికి మంచి ఉపాధి లభించటంతో పాటు, గోడౌన్ యజమానులకు కూడా కూలీల కొరత భారాన్ని తీర్చిన వారవుతారు. గోడౌన్ల నుండి ఎరువుల బస్తాలు, బియ్యం బస్తాలు, ధాన్యం, శనగ బస్తాలను రవాణా కోసం అక్కడ లారీలు బారులు తీరి ఉంటాయి. దానికి కారణం కేవలం హమాలీల కొరత వల్ల లోడింగ్ – అన్‌లోడింగ్ ఆలస్యం కావటమే. ఈ సమస్యకు మహిపాల్ తయారు చేసిన ఈ చిన్న పరికరం ఎంతో లబ్ధిని చేకూర్చుతుంది.

కాబట్టి గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు, పట్టణ, నగర ప్రాంతాల్లోని ట్రాక్టర్ యజమానులు కూడా ఈ పరికరం ఏర్పాటు చేసుకోవటం ద్వారా హమాలీ ఖర్చును సగానికి పైగా తగ్గించటంతో పాటు యువతీ యువకులు కూడా ఉపాధి పొందవచ్చు. ●

**పరికరం కావాల్సిన వారు సంప్రదించండి:**
**వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904.**
**సుభాష్ చందర్ : 96528 01700**

# సెప్టెంబర్ - అక్టోబర్ 2021 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు



సికింద్రాబాద్ లోని 'పల్లెసృజన' కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర టి-హబ్ సి.ఇ.ఓ. సెప్టెంబర్ 28,2021న సందర్శించినప్పటి దృశ్యం.



'పల్లెసృజన' పాఠకులకు పరిచితుడైన రైతు ఇన్నోవేటర్ నరాల రాజశేఖర రెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు సెప్టెంబర్ 17, 2021న 'ఉత్తమ రైతు'గా గుర్తించి సన్మానిస్తున్న దృశ్యం.




జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్‌ను జిల్లా కలెక్టర్ జి. రవి, ఐ.ఎ.ఎస్. 'ఇంటింటా ఇన్నోవేటర్-2021' ఉత్తమ ఇన్నోవేటర్ పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం.



జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన ఇన్నోవేటర్ గోనె కిషన్ కుమార్‌ను జిల్లా కలెక్టర్ జి. రవి, ఐ.ఎ.ఎస్. 'ఇంటింటా ఇన్నోవేటర్-2021' పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం.










మూడు పునాది స్థాయి ఇన్నోవేషన్‌లను అభివృద్ధి చేసేందుకు ఎం.ఎల్.ఆర్.ఐ.టి. కళాశాలతో ఒప్పందం కుదుర్చుకుంటున్న 'పల్లెసృజన' బృందం



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## విత్తనాలు నాటి, ఎరువులు వేసే చేతి పరికరం:

**సమస్య – పరిష్కారం :**

వ్యవసాయంలో విత్తనాలు వేయటమనేది చాలా ముఖ్యమైన కార్యక్రమం. సరైన సమయంలో, సరైన పద్ధతిలో విత్తనాలు నాటకపోతే మొత్తం పంట దెబ్బతినే ప్రమాదముంది. దీనికి రైతులు వివిధ రకాల పద్ధతులను వాడుతూ వుంటారు. స్థితిమంతులైన రైతులు ట్రాక్టర్లు వాడినా, ఎక్కువ సంఖ్యలో వుండే పేద రైతులు చేతితో విత్తనాలు నాటడం కష్టమైన పనిగానే వుంటుంది. సాంప్రదాయ పద్ధతిలో చేతులతో విత్తనాలు నాటడానికి మనిషి వంగి, చేతితో గుంత చేసి, విత్తనం వేసి మళ్ళీ మట్టిని పూడ్చవలసి వుంటుంది. మరలా రెండవ విత్తనం వేయటానికి ఇదే పద్ధతి అవలంభించాలి. ఇలా కొన్ని వేలు, లక్షల్లో విత్తనాలు వేయాల్సి వుంటుంది. ఇదంతా ఎంతో శ్రమతో కూడుకున్న పని, ఇలా చేయటం వల్ల నడుం నొప్పితో చాలా ఇబ్బంది పడ్డ రైతులు, కూలీలు కూడా ఉన్నారు. ఈ సమస్య పరిష్కారానికి మనిషి వంగి పని చేయాల్సిన అవసరం లేకుండా, నిలబడే గుంత చేసి, విత్తనం వేసి,





పూడ్చేసేలా ఒక పరికరాన్ని తయారు చేశాడు గుజరాత్‌కు చెందిన 'మన్సుక్ భాయ్ డిగాని'.

**పరికరం :**

ఈ పరికరం ఒక గొట్టం రూపంలో వుండి, క్రింది భాగంలో భూమిలోకి చొచ్చుకొని పోయే విధంగా మొనదేలి వుంటుంది. పై భాగంలో విత్తనాలు, ఎరువులు వేసుకోవటానికి అనువుగా ఒక పెట్టెను ఏర్పాటు చేసి వుంటుంది. ఈ గొట్టంలో స్ప్రింగు అమర్చబడిన ఒక ఇనుప కడ్డీ వుంటుంది. అది పైన ఏర్పాటు చేసిన ఒక లివర్‌ను నొక్కినపుడు విత్తనం డబ్బా తెరుచుకుని విత్తనం నేలలోకి దిగుతుంది, దాన్ని పైకి గుంజి కాలితో మట్టిని మూసివేస్తే సరిపోతుంది. ఇదేవిధంగా ఎరువును కూడా వేసుకోవచ్చు.

**సాంకేతిక వివరాలు :**

- మనిషి వంగకుండా పని చేయటానికి వీలుగా ఉంటుంది.
- ఎంత లోతు అవసరమనుకుంటే అంత లోతుగా భూమిలోకి చొప్పించవచ్చు.

**ముఖ్యాంశాలు :**

- దీనితో పని చేయటం చాలా సులువు.
- సమయము, కూలీల ఖర్చులు ఆదా చేసుకోవచ్చు.
- శారీరక శ్రమ చాలా తక్కువ.
- ఒకే రకంగా విత్తనం వేయటం వలన మొలక శాతం పెరిగే అవకాశముంటుంది.
- విత్తనాలు, ఎరువులు వృధా కావు.
- తక్కువ ఖర్చులో పనైపోతుంది.

## వివిధ పంటల నూర్పిడి యంత్రం

**సమస్య – పరిష్కారం :**

దేశంలో ఏ మూల వున్న రైతుకైనా ధాన్యం ఎక్కువగా నష్టపోకుండా, శుభ్రమైన గింజలను అందించే నూర్పిడి యంత్రం ఎంతో అవసరం. మార్కెట్లో రకరకాల నూర్పిడి యంత్రాలు అందుబాటులో వున్నా, ఒక్కో పంటకు ఒక్కో రకం యంత్రాలు ఉంటాయి. అవి కూడా ధాన్యం నష్టం ఎక్కువగా జరగకుండా నియంత్రించలేక పోవడమే కాదు, శుభ్రమైన ధాన్యాన్ని కూడా అందించలేవు. ఈ సమస్యలన్నీ పరిష్కరించేందుకు దాదాపు అన్ని రకాల ధాన్యాలను నూర్పిడి చేసేందుకు ఒకే యంత్రం తయారు చేశారు రాజస్థాన్‌కు చెందిన 'మదన్‌లాల్ కుమావత్'. ఈ యంత్రం తక్కువ ధాన్యం నష్టంతో, ఎక్కువ శుభ్రమైన ధాన్యాన్ని రైతుకు అందిస్తుంది.

**పరికరం :**

మదన్‌లాల్ బజార్లో లభించే ఇతర నూర్పిడి యంత్రాలలో



వుండే ఇబ్బందులన్నింటిని అధిగమిస్తూ, ఎక్కువ సామర్థ్యం కల అనేక రకాలైన పప్పుదినుసు పంటలు, ధాన్యాలే కాక, కొద్దిపాటి మార్పులతో వేరుశనగను కూడా నూర్పిడి చేసుకునే విధంగా దీన్ని రూపొందించాడు. దీనిలో నూర్పిడి చేసుకున్న తర్వాత తిరిగి ఏ రకమైన శుభ్రపరిచే ప్రక్రిత చేపట్టకుండానే నేరుగా మార్కెట్‌కు తరలించవచ్చు. ఒక ధాన్యం నుండి మరో ధాన్యం నూర్పిడి చేసుకునేలా పరికరంలో మార్పు చేయాల్సిన సమయం కూడా పదిహేను నిమిషాలకు మించదు. ధాన్యపు గడ్డి లేదా చొప్పలను కూడా చిన్న చిన్న ముక్కలుగా చేసి ధాన్యంతో పాటు కాకుండా వేరే ద్వారం ద్వారా బయటకు పంపిస్తుందీ యంత్రం.

**సాంకేతిక వివరాలు :**

- ఈ యంత్రంలో మూడు ముఖ్యమైన భాగాలుంటాయి.
- ఒకటి ధాన్యపు గడ్డి, వగైరాలను చొప్పించేది, రెండవది వాటిని ముక్కలుగా చేసేది, మూడవది వృధాను, ధాన్యాన్ని వేరు చేసేవిగా



భాగాలుంటాయి.

- ధాన్యాలు మార్పు చెందినపుడు వీటిలో మొదటి భాగంలో మాత్రమే ఆ ధాన్యానికి అనువైన గేరును మార్చాల్సి వుంటుంది.
- యంత్రం కొలతలు : పొడవు – 3.9 మీ., వెడల్పు – 1.9 మీ., ఎత్తు 2 మీటర్ల వరకుంటుంది.
- 5 సిలిండర్ల గేర్ బాక్స్ కలిగి వుంటుంది.
- మూడు డ్రమ్ముల్లో బ్లేడ్లతో కూడిన 3 చక్రాలు అమర్చబడి వుంటాయి.
- యంత్రం మొత్తం రెండు టైర్ల చట్రంపై అమర్చబడి వుంటుంది.
- ఈ యంత్రం సామర్థ్యం గంటకు – గోధుమలు : 18–25 క్వింటాళ్ళు, పప్పు ధాన్యాలు – 14–18 క్వి., బార్లీ : 25–30 క్వి., జొన్నలు – 18–22 క్వి., సోయాబీన్ – 15–20 క్వి., వేరుశనగ – 20–22 క్వి., మొక్కజొన్న – 8–10 క్వి. వరకు నూర్పిడి చేసుకోవచ్చు.

**ముఖ్యాంశాలు :**

- 35 హార్స్‌పవర్‌ల ట్రాక్టర్‌కు కూడా అనుసంధానం చేసుకోవచ్చు.
- అనేక పప్పు దినుసులే కాక, సజ్జలు, జొన్నలు, శనగలు, మెంతులు, బార్లీ, జీలకర్ర, మినుములు, ఆవాలు, సోయాబీన్, వేరుశనగ, పెసర, ఆలసంద మొదలైన ధాన్యాలను నూర్పిడి చేసుకోవచ్చు.
- వేరుశనగ నూర్పిడి చేయగల ఏకైక యంత్రం ఇది.
- ఒక ధాన్యం నుండి మరో ధాన్యం నూర్పిడికి మార్పు చేయటం చాలా తేలిక, తక్కువ సమయం.
- కత్తిరించడం, నూర్పిడి చేయటం వరుసగా జరిగే యంత్రం.
- ఒక్కో పంటను ఒక్కోరకంగా యంత్రానికి అందించవలసి వుంటుంది.
- పంటను బట్టి యంత్రంలోని బ్లోయర్ వేగాన్ని నియంత్రించుకోవచ్చు.
- నూర్పిడి సామర్థ్యం 99.6%, శుభ్రత సామర్థ్యం 99%, ధాన్యం నష్టం 0.25%, గింజలు పక్కలకు ఎగిరి పోవటం 0.36% లతో ఎంతో సమర్థవంతమైన యంత్రం.

**పురస్కారాలు :**

- ఎన్.ఐ.ఎఫ్. 2001 జాతీయ పురస్కారం పొందింది.

**కావాలనుకున్నవారు సంప్రదించండి:**

పల్లెసృజన, ఫోన్ : 040–27111959,
సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)

# 'పల్లెసృజన' లో ప్రతి శనివారం "రైతు సదస్సు"

## రైతులకు, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్.పి.ఓ.) సభ్యులకు ఆహ్వానం

'పల్లెసృజన – క్రియేటివ్ మైండ్స్' **FPO** సభ్యుల కొరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న

**"రైతుల కోసం రైతులు చేసిన గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్ల పై సదస్సు"**

**ప్రతి శనివారం నిర్వహించ బడుతున్నది**

ఈ సదస్సులో రైతుల సమస్యలకు సరళమైన, అందుబాటులో వుండే యాంత్రిక పరిష్కారాలు, విత్తనాలు, మొక్కలు, పశు మరియు మానవ ఆరోగ్యానికి చెందిన సూచనలు, ఆయుర్వేద పురుగు మందులు లాంటి రైతులు ఆవిష్కరించిన జ్ఞానము..... ఇవన్నీ ప్రదర్శించబడతాయి. మీ సమస్యలను చర్చించి వాటికి పరిష్కారాలు సాధించటానికి ప్రయత్నాలు జరుగుతాయి. ఈ సదస్సుకు ఎఫ్.పి.ఓ. సభ్యులు, రైతులు అందరూ ఆహ్వానితులే. వ్యవసాయంలో శ్రద్ధ వున్న ఎవరైనా ఈ సదస్సుకు ఆహ్వానం.

సదస్సుకు రావాలి అనుకున్న వారు ముందుగా మీ పేరు నమోదు చేసుకో గలరు. కరోనా వైరస్ ప్రమాదం దృష్ట్యా కేవలం 30 మందికి మించకుండా పాల్గొన వచ్చు. మీరు మీ పేరు నమోదు చేసుకున్న తర్వాత మా తరుపున నిర్ధారించిన వారు మాత్రమే పాల్గొనాల్సి వుంటుంది. అందరి సహకారాన్ని కోరుతున్నాం.

సదస్సు నిర్వహించే స్థలము :

**'పల్లెసృజన' కార్యాలయము, ప్లాట్ నెం. 77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి, సికింద్రాబాద్.**

**సమయం : ఉ. గం. 10–30 నుండి మ. 1–30 గం.ల వరకు.**

**వివరాలకు సంప్రదించండి : సుభాష్ చందర్, ఫోన్ : 9652801700**

# ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం

'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో

લોકસરવાણી
Loksarvani
(Gujarati version of Honey Bee)
SRISTI, P O Box No. 15050
Ambawadi, Ahmedabad - 380015, Gujarat
loksarvani@sristi.org

**21101 పశువుల్లో నులిపురుగుల నివారణకు:**

పశువుల పోషణలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి ప్రేవుల్లో నులి పురుగులు ఏర్పడి అవి తిన్నది అరగక బాధపడుతూ వుంటాయి. అశ్రద్ధ వహిస్తే పశువు క్రమంగా క్షీణించి మరణించే ప్రమాదముంది. పశువులలో నులి పురుగుల నివారణకు బజార్లో చాలా మందులు దొరుకుతున్నాయి. కానీ గుజరాత్ రాష్ట్రం, బరూచ్ జిల్లా, కంబూడి గ్రామానికి చెందిన 'పుల్జీభాయ్ ఉమార్ భాయ్ వాస్వా' మన పెరట్లో దొరికే చెట్లతోనే వీటికి ఉత్తమమైన చికిత్స అందించవచ్చు అంటున్నారు. ఈయన పద్ధతి ప్రకారం 100 గ్రా. వేపాకులు, 100 గ్రా. దానిమ్మ ఆకులను మెత్తగా నూరి, 400 మి.లీ. నీటిలో కలపాలి. ఒక గంట తర్వాత ఆ మిశ్రమాన్ని బాగా కలిపి రోజుకు ఒకసారి చొప్పున రెండు మూడు రోజులు పశువు చేత తాగిపిస్తే నులి పురుగుల నుండి నివారణ పొందవచ్చు అంటున్నాడు.



**21102 పంటలలో రసం పీల్చే పురుగుల నివారణకు:**

ఈ రసం పీల్చే పురుగు ఏ పంటకైనా, మొక్కకైనా సోకి చెట్టు ఆకులలోని రసాన్ని పీల్చేసి మొక్కలను నిర్వీర్యం చేసి అవి నశించిపోయేలా చేస్తాయి. వీటి నివారణకు గుజరాత్‌కు చెందిన 'పరుషోత్తమ్ భాయ్' చక్కటి, తేలికైన ఉపాయం చెపుతున్నాడు. ఈయన చాలా కాలంగా తన పొలంలో ఇదే పద్ధతిని వాడుతున్నాడట. ఈయన వేపాకులు, మజ్జిగ తేటను ఉపయోగించి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. వేపాకులను నీటిలో వేసి ఆ నీరు మూడవ వంతుకు వచ్చే వరకు మరగబెట్టి, 200 మి.లీ. ఆ కషాయాన్ని తీసుకుని, 1500 మి.లీ. మజ్జిగ తేటలో కలిపి పొలాలపై పిచికారి చేస్తే ఈ రసం పీల్చే పురుగు నుండి నివారణ పొందవచ్చు అని చెపుతున్నాడు.



**21103 వెల్లుల్లి పంటను చీడనుంచి కాపాడటానికి:**

గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'పరుషోత్తమ్ భాయ్' ఈ ఉపాయం కూడా చెబుతున్నారు. భారత సుగంధ ద్రవ్యాల బోర్డు లెక్కల ప్రకారం 2002-2007 మధ్యలో గుజరాత్ రాష్ట్రంలో వెల్లుల్లి ఉత్పత్తి 480 శాతం పెరిగింది. ప్రత్యేకించి జునాగఢ్ జిల్లాలో అత్యధికంగా వెల్లుల్లి పండిస్తుంటారు. ఆ జిల్లాలోని రైతులు వెల్లుల్లి పంటను కాపాడటానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్నిచ్చే సేంద్రియ పద్ధతిని పాటిస్తున్నారు. దాన్ని పరుషోత్తమ్ భాయ్ మనకు తెలియజేస్తున్నారు. మజ్జిగ, గోమూత్రము, కుళ్ళిపోయిన సజ్జలపిండి ఈ మూడింటిని బాగా కలిపి వెల్లుల్లి పంటపై పిచికారి చేసి పంటను చీడల నుండి రక్షించుకోవచ్చు అని చెపుతున్నారు.

ఇంకొక రైతు 'రమేష్ భాయ్' మరో పద్ధతి వాడి తన వెల్లుల్లి పంటను చీడనుండి కాపాడుకుంటున్నాడు. ఆయన ఆముదము, నీరు, బట్టలుతికే సోడను కలిపి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. ఒకటిన్నర లీటర్ల ఆముదము, 100 గ్రా. బట్టలుతికే సోడ, 20 లీటర్ల నీటిలో కలిపి పంటకు నీరు పెట్టిన తర్వాత రెండు మూడు సార్లు పంటపై పిచికారి చేస్తే మంచి ఫలితం వుంటుందని చెపుతున్నారు.



**21104 మిరప పంటను తెగుళ్ళనుండి కాపాడటానికి:**

గుజరాత్‌కు చెందిన 'పరశురామ్ భాయ్' ఈ చిట్కా కూడా చెపుతున్నారు. మిరప పంటను తెగుళ్ళ బారినుండి రక్షించుకోవటానికి ఆయన నిమ్మ, కలబంద, పొగాకులను కలిపి వాడుతుంటాడు. ఆయన 2 కిలోల పొగాకు పొడి, 2 కిలోల కలబంద, 250 గ్రా. నిమ్మరసం లను 20 లీటర్ల నీటిలో కలిపి మరిగిస్తాడు. 250 మి.లీ. ఈ ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి 8 రోజులకొకసారి మిర్చి పంటపై పిచికారి చేస్తాడు. ఈ పద్ధతి వలన మిరప పంటలో 80 శాతం వరకు తెగుళ్ళను నివారించగలిగాననని చెపుతున్నాడు.

**21107 వరి, మినుము పంటలలో చీడల నివారణకు:**

వరి మినుము పంటలను చీడలు సోకి చాలా నష్టాన్ని కలిగిస్తుంటాయి. దీని నివారణకు అనేక ఖరీదైన రసాయన పద్ధతులు



వాడినా స్వచ్ఛమైన సేంద్రియ పద్ధతి ఒకటి వుంది అంటున్నారు గుజరాత్ రాష్ట్రం లోని బనస్కాంత ప్రాంతానికి చెందిన 'జమాల్ భాయ్ నూరాభాయ్ మోడీ'. ఈయన పులికంప చెట్టు ఆకులు, పొగాకు, రేలకాయలు (రోడ్ల పక్కలో విరివిగా లభించే నల్లని పొడగాటి కాయలు, ఈ చెట్ల పూత పసుపు వర్ణంలో వుంటుంది) ను కలిపి తయారు చేసుకుంటాడు. రెండు లీటర్ల ద్రావకం తయారు చేసుకోవటానికి ఆయన 200 గ్రా. పులికంప ఆకులు మరియు పూలు, 200 గ్రా. పొగాకు చెట్టు వేర్ల పొడి, 200 గ్రా. రేల కాయల పొడిని మూడు లీటర్ల నీటిలో కలిపి ద్రావకం 2 లీటర్లు అయ్యేంత వరకు మరగబెట్టాలి. ఈ కషాయాన్ని నీటిలో కలిపి పంటలపై పిచికారి చేస్తే మంచి ఫలితముంటుంది.

**బెండ పంటను చీడ పీడల నుండి కాపాడటానికి:**

గుజరాత్ రాష్ట్రంలోని సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా, మాయానగర్ గ్రామ నివాసి 'జనక్ కుమార్ వ్రజిలాల్ చోహాన్' తన బెండ పంటను చీడ పీడలనుంచి కాపాడటానికి స్వయంగా ఓ పద్ధతిని కనుగొన్నాడు. ఈయన మెంతుల పొడిని ఉపయోగించి, ఒక ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. ఇది వాడటం వలన మంచి ఫలితం వుంటుంది అని చెపు తున్నారాయన. దీనికై ఆయన మెంతులను మెత్తగా నూరి పొడి చేసుకుని, ఒక కిలో పొడిని నీటిలో కలిపి మూడు రోజులపాటు మురగ బెడతాడు. మూడు రోజుల తర్వాత ఈ పొడి కొంత చిక్కగా, జిగురుగా మారుతుంది. ఆ చిక్కటి ద్రావకాన్ని మెత్తని చీపురుతో పంటపై చిలకరిస్తాడు. ఈ మెంతులకి వున్న ప్రత్యేకమైన వాసన చీడపీడలను, పురుగులను మొక్కల దగ్గరికి రానీయదు.

**ఆకుముడత పురుగు నివారణకు:**

చాలా రకాల పంటలలో ఆకుముడత తెగులు పంటకు ఎంతో నష్టాన్ని చేకూరుస్తుంది. ఈ తెగులు ప్రత్యేకించి, చలికాలం, మేఘావృతమైనప్పుడు ఎక్కువగా సోకుతుంది. దీని నివారణకు గుజరాత్ రాష్ట్రం, సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా, దేవీపూర్ గ్రామ నివాసి 'మహేష్ భాయ్ జయరామ్ భాయ్ లఖాత్రియా' గన్నేరు చెట్లను ఆశ్రయిస్తాడు. ఇది పూర్తి సేంద్రియ పద్ధతే అని చెపుతాడాయన. ఆయన రెండు కిలోల గన్నేరు ఆకులను తీసుకుని, మెత్తగా నూరి ముద్దచేసి, ఆ ముద్దను 5 లీటర్ల నీటిలో కలిపి ఐదారు రోజులపాటు మురగబెడ్తాడు. తర్వాత ఈ ద్రావకాన్ని కొద్దిసేపు మరిగించి, 150 మి.లీ. ఈ మరిగించిన ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి పంటపై ఆకులు క్రింద భాగానికి తగిలేలా పిచికారి చేస్తాడు. దీంతో ఆకుముడత తెగులు సమర్ధవంతంగా అరికట్ట బడుతుంది అంటారు. ఈ ద్రావకాన్ని మురగబెట్టేటపుడు గాలి పారకుండా మూత పెడితే త్వరగా మురిగిపోతుందట. ఈద్రావకం బూజు తెగులుకు కూడా బాగా పనిచేస్తుంది అంటారాయన.





## పల్లెసృజన

# చిన్న శోధయాత్ర – జ్ఞాన యాత్ర

'పల్లెసృజన' ఒక స్వచ్ఛంద సంస్థ. దీని నిర్వాహకులు, వాలంటీర్లు అంతా స్వచ్ఛందంగా పనిచేస్తారు. గ్రామాల్లోవున్న సృజనాత్మకతను వెతికి, సమాజానికి తెలియపరచడం, సృజనాత్మకత గల వ్యక్తులను (ఇన్నోవేటర్స్‌ను) గౌరవించి వారిని ప్రపంచానికి పరిచయం చేయాలన్న ప్రధాన లక్ష్యంతో 2005లో 'పల్లెసృజన' స్థాపించబడింది. చదువుకోని గ్రామ ప్రజల్లో కూడా శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు ఉన్నారని త్రికరణశుద్ధిగా 'పల్లెసృజన' నమ్ముతుంది. అలాంటి జ్ఞానవేత్తల జ్ఞానాన్ని గుర్తించి, గ్రంథీకరించి, ఆ జ్ఞానాన్ని సమాజానికి అందించటంతో పాటు ఆ జ్ఞానకర్తను సమాజం గుర్తించేలా చేయటం 'పల్లెసృజన' ప్రధాన కార్యక్రమం. జ్ఞానశోధనకై 'పల్లెసృజన' ఆధ్వర్యంలో సాగుతున్న యాత్రే 'చిన్నశోధయాత్ర'.

మరుగున పడుతున్న జ్ఞాన దేవాలయాలను (గ్రామాలను) దర్శిస్తూ జ్ఞానాన్వేషణ చేయడం, ప్రకృతితో సమన్వయంగా సహజీవనం చేస్తూ ప్రకృతినుంచి జ్ఞానాన్ని పొందే గ్రామీణులను కలవాలన్నదే 'శోధయాత్ర' ప్రధాన ఉద్దేశ్యం. ఇలాంటి శోధయాత్రలను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' (ఎన్.ఐ.ఎఫ్.) సంవత్సరానికి రెండుసార్లు 7 రోజులు దేశంలోని అన్ని రాష్ట్రాలలో నిర్వహిస్తుంది. అందుకే ఇది చిన్న శోధయాత్ర.

తెలుగు రాష్ట్రాలలో 'చిన్నశోధయాత్ర'ను ఎన్.ఐ.ఎఫ్. స్ఫూర్తితో పల్లెసృజన నిర్వహిస్తున్నది. గత 10 సంవత్సరాలుగా 38చిన్నశోధయాత్రలు దాదాపు ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాల్లో జరిగాయి. మూడు రోజులపాటు జరిగే ఈ యాత్రలో పాల్గొనే యాత్రికులు స్వచ్ఛందంగా ప్రకృతితో మమేకమై గ్రామీణ ప్రజలతో జ్ఞానాన్ని పంచుకుంటూ. నేర్చుకుంటూ యాత్ర సాగిస్తారు.

**39వ "చిన్న శోధయాత్ర - జ్ఞాన యాత్ర"**

**17-19 డిసెంబర్, 2021 తేదీలలో నిర్వహించ బడుతుంది.**

పాల్గొనాలనే ఉత్సాహమున్న వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకో గలరు.

**ముప్పారపు రాజు, ఫోన్ : 99859 19342, అంజిరెడ్డి, ఫోన్ : 99666 46276,**

**బ్రిగేడియర్ పోగుల గణేశం, 9866001678**

లేదా వెబ్‌సైట్ : http://pallesrujana.org ని సందర్శించి వివరాలు తెలుసుకో గలరు.

# రైతు సమస్య – మీ పరిష్కారం

ఈ సమస్యను అందించిన వారు జోగులాంబ గద్వాల జిల్లా, అయిజ మండలం, విఠలాపురం గ్రామానికి చెందిన ఎ. మాణిక్యాల రెడ్డి అనే రైతు 'పల్లెసృజన'తో ఈ క్రింది సమస్యను పంచుకున్నాడు.

## మునక్కాయలు సులభంగా కోసేందుకు పరిష్కారం

వీరు మునగ సాగు ఎన్నో సంవత్సరాల నుండి చేపడుతున్నాడు. కానీ ఇటీవలి కాలంలో మునగ కాయలు కోయటం వల్ల కలిగే ఇబ్బందుల వల్ల ఆ సాగు తగ్గించాలి అనుకుంటున్నాడు. ఈ సమస్యకు పరిష్కారం అందించ గలిగితే మునగ సాగు ఆనందంగా కొనసాగిస్తాను అంటున్నారు.

ఇటీవలి కాలంలో మార్కెట్‌లో మునగ రేటు రోజు రోజుకూ పెరుగుతూనే ఉంది. అందుకు కారణం మునగ ఉపయోగించే వినియోగదారులు పెరగటం ఒకటైతే, మునగ పంట విస్తీర్ణం అనుకున్న రీతిలో పెరగటం లేదేమో అన్న అభిప్రాయం కూడా కొందరిలో ఉంది. దీనికి కారణం ప్రధానంగా మునక్కాయలు కోయటంలో ఎదురయ్యే ఇబ్బందులే.

మునగ పంటను పండించే రైతులు ఎదుర్కొంటున్న ఈ సమస్యకు పరిష్కారాన్ని 'పల్లెసృజన'తో పంచుకో గలరు. తద్వారా మునగ రైతులకు గణనీయమైన ఖర్చు తగ్గించటంతో పాటు, మునగ సాగు పట్ల రైతులు విముఖత చూపకుండా మంచి ఆదాయాన్ని పొందేలా చేయగలగాలని 'పల్లెసృజన' భావిస్తోంది.

మీ ఇన్నోవేషన్ ఐడియా లేదా ప్రొటోటైప్ (నమూనా పరికరం) ఈ క్రింది నంబర్లకు వాట్స్ యాప్ ద్వారా పంచుకో గలరు.

**వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, వీరరాఘవ రెడ్డి, 81257 99904**

# సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేను సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము. – ఎడిటర్

**వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700**




కాల, ప్రాంతాలకు అతీతంగా శాస్త్ర విజ్ఞాన జిజ్ఞాస మానవాళిని అంటిపెట్టుకునే వుంది. ప్రాచీన భారత దేశంలో విభిన్న రంగాలలో విశేష కృషి చేసిన మహనీయులు విజ్ఞానాన్ని బహు ముఖాలుగా విస్తరించే ప్రయత్నం చేసిన ఆలోచనాపరులు కోకొల్లలు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు, చరకుడు, సుశ్రుతుడు, భాస్కరుడు మొదలైన వారు ఖగోళము, గణితము, వైద్యము లాంటి శాస్త్రాలలో తమ పరిశోధనల ద్వారా కొన్ని మైలురాళ్ళను సృష్టించారు. ఆ కోవలోకి చెందిన వారే 'సురపాలుడు'.

వృక్ష శాస్త్రంలో నిగూఢమైన విషయాలను ఎన్నింటినో పరిశోధించి, అపురూపమైన వృక్ష వైద్య రహస్యాలను గ్రంథస్తం చేసినవాడు సురపాలుడు. మొక్కల లక్షణాలు కూడా మానవుల శరీరాన్ని పోలి వుంటుందన్న శాస్త్ర పరిజ్ఞానాన్ని ఆవిష్కరించినవాడు సురపాలుడు. వృక్ష శాస్త్రంలో విశేషమైన కృషి చేసిన ఈ మహనీయుడి గురించిన సమాచారం ఇటీవలి వరకు మన దృష్టికి రానేలేదు. ఆయన రచించిన "వృక్షాయుర్వేదం" అన్న గ్రంథం ఇంగ్లాండులోని ఒక గ్రంథాలయంలో ఇటీవలే బయట పడింది. ఆ పుస్తక ఆంగ్లానువాదం 'ఏసియన్ అగ్రో హిస్టరీ ఫౌండేషన్ (ఎఎహెచ్ఎఫ్), హైదరాబాద్ వారు **1996**లో ప్రచురించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వృక్ష శాస్త్రం పట్ల ఆసక్తిగల ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా పరిశోధకులకు, విద్యార్థులకు, రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో 'ఐ-సర్వ్', హైదరాబాద్ వారు **2015** లో తెలుగు అనువాద ప్రక్రియకు ఉపక్రమించడం జరిగింది.

ఈ గ్రంథాన్ని 'పల్లెసృజన' పాఠకులకు అందించాలన్న సంకల్పంతో ఈ సంచికనుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం. ఈ గ్రంథంలోని మహత్తరమైన జ్ఞానాన్ని పాఠకులు అవగాహన చేసుకుని, ఆచరిస్తారని ఆశిస్తున్నాం.
- ఎడిటర్.

(గత సంచిక తరువాయి)

81. ఒక మూర పొడవు, ఒకమూర వెడల్పు, ఒక మూర లోతుగల గోతులు తవ్వి గడ్డలు పాతిపెట్టాలి. ఇసుక కలిపిన బురదతో గోతులు నింపాలి.

82. "అరటి"ని వేరుతో సహా గోతిలో పెట్టాలి. గోతిలో పెట్టకముందే వేరుకు ఆవు పేడను బాగా రాయాలి. ఆ తర్వాత నీళ్ళు బాగా పెట్టాలి.

83. చిన్న మొక్కలయితే ఒకమూర పొడవు వుండగా పగటిపూటనే నాటాలి. నాటుతున్నపుడు దిక్కులు సరిగా పాటించాలి. తేనె, తామర పీచు, నెయ్యి మరియు విడంగాలను వేర్లకు బాగా రాసి, మట్టితో కప్పి సరి అయిన గోతులలో పాతాలి.

84. పెద్ద చెట్లయితే పైన పేర్కొన్న పద్ధతిలోనే వాటి వేర్లను కప్పివుంచి సాయంత్రం పూటనే పాతాలి. అంతకు ముందురోజు ఈ క్రింద సూచించిన మంత్ర పఠనం చెయ్యాలి.

85. "ఓ వృక్షమా! నిన్ను ఇంకా మంచి చోటుకే తీసుకెళతాను : అక్కడ నీవు సంతృప్తి పడే విధంగా నీళ్ళు పెడతాను".

86. "అక్కడ నీవు బాగా వృద్ధి పొందుతావు. పిడుగు పడటం లాంటి భయాలేవీ ఉండవు. అక్కడ నిన్ను నాకు అతి ప్రియమైన స్వంత కొడుకులా సంరక్షించుకుంటాను".

87. "క్షీరిక (పాల చెట్టు), తుటము, దానిమ్మ, పగడ మున్నగు మొక్కలను శ్రావణ మాసం (వర్షాకాలం మధ్యలో) లో నాటాలి. "రాజకోశము" (బీర?) "గజనిమ్మ", మామిడి మున్నగు వాటిని భాద్రపద మాసంలో (వర్షాకాలం తగ్గుముఖం పడ్తున్నపుడు) నాటాలి.

88. "గొల్ల", "వంగ" మున్నగు వాటిని "ఆశ్వయుజ" మాసంలో నాటాలి. "ఫనిజ్జకము" (మరువము) "శతపత్రిక", "ధన్యక" (ఉసిరిక) "ములకము" (ముల్లంగి) మున్నగు వాటిని కార్తీకమాసంలో నాటు పెట్టాలి.

89. "ఫాల్గుణ" మాసంలో (వసంత ఋతువు ప్రారంభ దశలో) "పొట్ల" మున్నగు వాటిని, "చైత్ర" మాసం (వసంత ఋతువు)లో "కాకర్యకము" మున్నగు వాటిని నాటాలి. తెలివయిన వారయితే "అరటి" మొదలైన వాటిని "వైశాఖమాసం" (వేసవి కాలం మొదలైన కాలం)లో నాటుతారు.

90. ఏ మొక్కనైనా ఆషాఢ మాసంలో నిరభ్యంతరంగా నాటవచ్చు. అయితే "మార్గశిర, పుష్యం, మాఘం" (బాగా చల్లగా వుండే సమయమన్నమాట) మాసాలు మాత్రం మొక్కలు నాటడానికి అంత అనువయినవి కావు.

91. విజ్ఞులయిన వారు మొక్కలకు అన్ని వైపులా తప్పనిసరిగా "ఖిల్లోతం" (భల్లాతకం...?) మొక్కలను నాటాలి. అవి వాటి ఆరోగ్యాన్ని కాపాడతాయి.

92. "ఫలిని, అశోకం, పున్నాగం, శిరీషం (దిరిసెన), వేప" మొక్కలు శుభప్రదమయినవి. కాబట్టి వాటిని ముందు నాటితే మంచిది అవి రోగాలను, ప్రమాదాలను నివారిస్తాయి.

93. "కరమర్ధము (కలివె), వెదురు" మొక్కలను తూర్పు దిక్కున "పారావతం" (కోతి తుమికి) చెట్లను దక్షిణం వైపు, "రేగి, వెలగ, ఉసిరి" ఉత్తరం వైపు నాడటం శుభప్రదం. పీచు పీచుగా ఉండే వార్లుగగల చెట్లు మరియు మంచి మధ్యస్థం, నాసి రకాల గట్ల (హద్దులు) పొడవునా ఒక క్రమ పద్ధతిలో ఎడం వదిలిపెట్టి అవేరకం చెట్లతో పాటు నాటాలి.

94. ఈ క్రింద పేర్కొన్న వివిధ ఆకృతులలో మొక్కలను నాటవచ్చు : "మండపం, నంద్యావర్తం (పశ్చిమ దిక్కున ద్వారంలాగా పేర్చిన చతుర్భుజ ఆకారం), స్వస్తిక్ (స్వస్తిక్ గురుతు), చతురస్రం (నలు చదరం), సర్వతో భద్రం (వృత్తాన్ని చుట్టి వేసిన చతురస్రం), వీధి (పంక్తి), నికుంజం (పొదరిల్లు), పుంజక (సమూహం లేదా గుత్తి)".

95. పళ్ళు, పూలు కాచే చెట్ల మధ్యలో ఉంచాలి. మిగతా చెట్లు వాటి చుట్టూ ఉండేలా చర్యలు తీసుకోవాలి. వాటిని జతలు జతలుగా నాటాలి. కాలువ త్రవ్వి చుట్టూ నాటే చెట్లను నాటాలి.

96. ఈ ప్రక్రియ ఆసాంతం తెలుసుకున్న తర్వాత వృక్షాల బాగోగులు చూసుకునే సంరక్షకుడు, దేవుని మరియు తన గురువుల అనుగ్రహం పొంది అన్ని మాలిన్యాలను తొలగించి మొక్కలు నాటే పనికి ఉపక్రమించాలి.

97. వృక్షాలు భూమీమ్మీద ఉన్నంతవరకు, ఆ తర్వాత కూడా సంతోషాన్నిస్తాయి. దుర్భర దారిద్ర్యం నుంచి రక్షించేవి కాబట్టి, వీటిని "తరువులు" (సంరక్షకులు) అని పిలుస్తారు.

98. తమ పుష్పాలు, ఫలాలు నీడలతో ధర్మ, అర్థ, కామ, మోక్ష్యాలను గొప్పగా అనుసరించడానికి తోడ్పడే వృక్షాలను చాలా జాగ్రత్తగా పోషించాలి.

99. పొగమంచు, తుఫాను, పొగ, నిప్పు, సాలె పురుగుల నుంచి మొక్కలను జాగరూకతతో కాపాడాలి.

100. నువ్వుల నూనె పూతతో చేసిన నువ్వుల పిండి ముద్ద మరియు కీటక సంహారకాలయిన విడంగాలను బాగా కలగలిపి దానిపై ఎరుపు ద్రావకం (కునపజలం)లో నీళ్లు పాలు కలిపి బాగా చిలుకరించాలి. ఆపై నెయ్యిని వేడి చేయగా వచ్చిన పొగలో కాసేపు ఉంచాలి. ఈ ముద్దను మొక్కల పూతగా పూయాలి. ఈ పనిని ఒక నిపుణుని చేతనే చేయించాలి.

**మొక్కల పోషణ:**

101 –107. .....

108. కొత్తగా నాటిని మొక్కలకు చిగురించే ఆకులు పగడాల రంగును పోలి ఉండనంత వరకు సూర్యరశ్మి నుండి జాగ్రత్తగా కాపాడు కోవాలి.

109. ఎండిపోయిన నేలల్లో నాటిని మొక్కలకు ప్రతిరోజు ఉదయము, సాయంత్రము వరుసగా ఒక పక్షం రోజులు నీళ్ళు పెట్టాలి. ఆ నేల పూర్తిగా నీటిలో తడిసేంత వరకు నీరు పడుతూనే ఉండాలి.

110. చిత్తడి నేలల్లో నీళ్ళు పట్టే పని అయిదు రోజులకొకసారి చేపట్టాలి. సాధారణ నేలల్లో అయితే పది రోజులపాటు ఉదయము, సాయంత్రము పరిమిత పరిమాణంలో నీళ్ళు పెట్టాలి.

111. బాగా వేళ్ళూనిన మొక్కలకు శీతాకాలంలో రోజు విడిచి రోజు, వసంత కాలంలో ప్రతిరోజూ సాయంత్రం, వేసవికాలంలో రోజుకు మూడు సార్లు నీళ్ళు పట్టాలి.



112. వర్షాకాలంలో మరియు శరత్ కాలంలో లేదా నేల తడారిపోయి పొడిగా తయారయినప్పుడు ఔషధ మొక్కల రసంలో మూత్రం, మూలుగ మరియు పాలు కలిపి మొక్కలకు పట్టాలి.

113–114. ......

115. వివేకవంతుడు మొక్కల చుట్టూ పెరిగే గడ్డిని మొత్తంగా తొలగిస్తాడు. పారతో చెట్టు వేళ్ళ దగ్గర గడ్డిని త్రవ్వి తీసేస్తాడు.

116 – 118 .....

119. నెయ్యి, విడంగం నీళ్ళల్లో కలిపిన పాలు, తేనెలతో మిశ్రమం తయారు చేసి దాని పొగను దట్టంగా చెట్లకు పడితే, ఆ చెట్లు త్వరితగతిని పూలు పండ్లు కాస్తాయి. (ఈ శ్లోకం కొంత భాగం అస్పష్టంగా ఉంది).

120– 125........

126. మినుములతో తయారు చేసిన రసం, ఉప్పు కలిపిన నీరు, బార్లీ గింజల పొడిని కలిపిన నీటిని ఎక్కువ పరిమాణంలో తీసుకుని కొబ్బరి చెట్లకు చికిత్స చేసినచో పెద్దపెద్ద కుండల లాగా కొబ్బరి బోండాలు కాస్తాయి. (ఈ శ్లోకంలో ఒక పదం అర్థం కాకుండా ఉంది).

127. తెల్ల ఆవాలు, బార్లి గింజలు, పొట్ల, గానుగ పిండిని కలిపిన నీటిని పట్టినచో రొట్టె పండు చెట్టు (ఇది పెద్ద చెట్టు. దీన్ని నిప్పున కాలిస్తే రొట్టె అవుతుంది), ఖర్జూరము, కమలము లాంటివి బాగా పెరుగుతాయి.

128 – 132 .....

133. త్రిఫల కషాయాన్ని నీళ్ళలో కలిపి ఆ నీళ్ళను పనస చెట్టుకు బాగా పట్టి వెంటనే పొట్టుతో కప్పెయ్యాలి. అలా చేస్తే మంచి పరిమాణం, తియ్యగా ఉండి గింజలు లేని పనస పళ్ళు కాస్తాయి.

134. "యష్టి మధుకం", నువ్వులు, తేనె మరియు 'కుణఫ జలం'"తో పాటు మిశ్రమం తయారు చేసి, దానిని నీళ్ళల్లో కలిపి, ఆ నీళ్ళను ఎక్కువ మొత్తంలో "కోలము" అనే చెట్టు యొక్క వేర్లకు పడితే ఆ మొక్క మారేడు పండ్లంత పెద్దవి, తేనెలాగా తియ్యని పళ్ళను కాస్తుంది. ●

**గమనిక : పైన కొన్ని సంఖ్యలలో ఖాళీగా ఉంచబడినవి. దానికి కారణం. అక్కడ వివరించిన విధానాలు ఎన్నో రకాల అడవి జంతువుల మాంసం, మరియు ఇతర శరీర భాగాలతో చేయవలసిన పనులు. ఇవి రైతులకు సాధ్యం కాదు, పైగా 'మృగ హింస' చట్టానికి గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి వాటిని వివరించటం లేదు.**

**(తరువాయి భాగం వచ్చే సంచికలో)**

# 10వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు




**ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో జాతీయ బహుమతి పొందిన విజేతల వివరాలు**

**- 'ఎన్.ఐ.ఎఫ్. వారి వ్యాసాలకు స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్**

## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

## పట్టు దారం చుట్టే యంత్రం



**పేరు : సూరజ్ ఛేతియా**

**నివాసి : శివసాగర్, అస్సాం**

అస్సాంలోని శివసాగర్ ప్రాంతానికి చెందిన 30 సం.ల 'సూరజ్ ఛేతియా' వృత్తిరీత్యా రైతు అయినప్పటికీ ఇతనికి కోళ్ళ దాణ అమ్మే దుకాణంతో పాటు కంప్యూటర్ రిపేర్ చేసే షాపు కూడా ఉంది. ఇతను 12వ తరగతి పూర్తి చేసిన తర్వాత స్థానిక ఐటిఐ లో ఒక సంవత్సరం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సు కూడా చదివాడు. తనకున్న తీరిక సమయాల్లో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలకి పరిష్కారాలు కనుగొనటంలో సహాయ పడుతూ వుంటాడు. ఇతను మోగ, మల్బరీ పట్టు దారాలను చుట్టే యంత్రంతో పాటు కోళ్ళ ఫారాల్లోని వ్యర్థాలతో బయో ఫర్టిలైజర్ కూడా తయారు చేశాడు.

సూరజ్ సాంప్రదాయ పద్ధతిలో మోగ సిల్క్ పండించేవాడు. కానీ ఆ దారాన్ని రీళ్ళుగా చుట్టేటపుడు చాలా సమయం, చాలా ఖర్చు అయ్యేది. బయట మార్కెట్‌లో రీళ్ళు చుట్టే యంత్రాలు చాలా ఖరీదైనవి. తన సమస్యకి తానే పరిష్కారం వెతుక్కోవాలి అన్న దృఢ సంకల్పంతో సిల్క్ దారం రీళ్ళుగా చుట్టే యంత్రం కనుగొనాలని నిర్ణయించుకొన్నాడు. తనవద్దనున్న బట్టలు కుట్టే మిషన్ భాగాలతో ఒక నమూనా యంత్రాన్ని తయారు చేశాడు. అది కొంత వరకు పని చేసినా, పూర్తిగా సమర్థవంతంగా చెయ్యటం లేదనే నిర్ణయానికి వచ్చాడు. దాంతో ఆ యంత్రానికి అనేక చేర్పులు, కూర్పులు చేసి ఒక కొత్త యంత్రాన్ని తయారు చేశాడు. ఈ యంత్రం ప్రత్యేకత ఏమిటంటే, నేతలో అవసరమయ్యే 'పడుగు', 'పేట' కి అవసరమైన రీళ్ళను రెండింటినీ ఒకేసారి చుట్టి ఇవ్వగలదు.

ఈ యంత్రాన్ని ఒక హార్స్‌పవర్ శక్తి గల మోటారుతో కరెంటు సహాయంతో పని చేయించవచ్చు. లేదా కరెంటు లేకున్నా కూడా చేతితో తిప్పుతూ పని చేసుకోవచ్చు. ఈ యంత్రం 8 గంటలలో 300 నుంచి 500 కుకూన్‌లను పేటకి, 250 నుంచి 300 కుకూన్‌లను పడుగు





అవసరార్థం చుట్టి ఇవ్వగలదు.

ఇంతకు ముందు ఎవ్వరు చేయని రెండు రకాల రీళ్ళను చుట్టే యంత్రం రూపొందించినందుకు గాను ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్ల మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 కి గాను 'సూరజ్ ఛేతియా' ను జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.

## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

### చందనాన్ని అరగదీసే యంత్రం

**పేరు: సుభాష్ వసంతరావు జగ్తప్**

**నివాసి: జల్గావ్, మహారాష్ట్ర**



మహారాష్ట్ర లోని జల్గావ్ ప్రాంతానికి చెందిన 70 సంవత్సరాల వయసు గల 'సుభాష్ జగ్తప్' ఎన్.ఐ.ఎఫ్. వారు 2005లో నిర్వహించిన 3వ జాతీయ గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్ల పోటీలలో మూడు చక్రాల బండి పై తీసుకుని వెళ్ళగలిగే స్ప్రేయర్‌ను రూపొందించి బహుమతి పొందిన వ్యక్తి. మౌళికంగా వెల్డింగ్ పని చేసే సుభాష్ రకరకాల డ్రిల్లింగ్ యంత్రాలు, ప్లైవుడ్‌ను కోసే యంత్రాలు మొదలైన వాటినెన్నింటినో రూపొందించాడు.

సుభాష్ తాను నివసించే ప్రాంతంలో వేర్వేరు మందిరాలలో పూజా సమయంలో గంధాన్ని అరగదీయటానికి అర్చకులు ఎంత కష్ట పడాల్సి వస్తుందో గమనించాడు. అది రోజుకు అనేకసార్లు కూడా చేయాల్సి వచ్చేది. దేవతార్చనకు పనికి వచ్చే ఒక మంచి చేయాలన్న సంకల్పంతో, తద్వారా అర్చకుల శ్రమను తగ్గించడం కోసం గంధాన్ని అరగదీయడానికి ఒక యంత్రాన్ని రూపొందించాలని నిర్ణయించుకొని అనేక ప్రయత్నాలు చేసి, అనేకసార్లు మార్పులు చేసి, గంధం తీసే వారి సంతృప్తి మేరకు ఈ యంత్రాన్ని రూపొందించడంలో సఫలీకృతుడు అయ్యాడు.

చందనాన్ని అరగదీసే ఈ యంత్రం కరెంటు సహాయంతో నడిచే తిరగలిలా ఉంటుంది. చిన్న గంధపు చెక్క ముక్కలను గుండ్రంగా వుండే తిరగలి రాతిపైన ఉంచి, మిషన్ ఆన్ చేస్తే తిరగలి తిరుగుతున్నపుడు కొద్ది కొద్దిగా నీరు పోస్తూ వుంటే, మెత్తటి అరగ దీసిన గంధం తయారు అవుతుంది. ఈ యంత్రం సహాయంతో గంటకు 5 కిలోల గంధాన్ని అరగదీయ గలరు. ఈ యంత్రం ఖరీదు సుమారు 35 వేల రూపాయలు ఉంటుంది.





ధార్మిక చింతన ఎక్కువగా ఉండే మన దేశంలో పూజా పునస్కారాలకు పనికి వచ్చే గంధాన్ని అరగదీసే యంత్రాన్ని కనుగొన్నం దుకు గాను సుభాష్ వసంత్‌రావ్ జగ్తప్‌కు ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్ల మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.

## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

### అన్ని వయసుల వారికి పనికి వచ్చే ఉయ్యాల

**పేరు: సపన్‌కుమార్ మండల్**

**నివాసి: నదియా, పశ్చిమ బెంగాల్**



పశ్చిమ బెంగాల్ లోని నదియా జిల్లాకు చెందిన 52 సంవత్సరాల సపన్‌కుమార్ మండల్ తాను నివసించే ప్రాంతంలో కరెంటు పనిలో నిష్ణాతుడిగా మంచి పేరు సంపాదించుకున్నాడు. కుటుం బం లోని ఆర్థిక పరిస్థితులు బాగా లేని కారణంగా పదవ తరగతి తోనే చదువు ఆపేసి, పని చేయడం ప్రారంభించాడు. వివిధ రకాల యంత్రాలను మరమ్మత్తులు చేయటం, అభివృద్ధి చేయడం ఇతనికి చాలా ఇష్టమైన పని.

సుమారు 15 సంవత్సరాల క్రితం సపన్ కుమార్‌కి కూతురు పుట్టినపుడు ఆమె కోసం ఒక ఊయల తయారు చేశాడు. ఆమె పెరుగుతున్న కొద్దీ కావలసిన అవసరార్థం దానిలో చిన్న చిన్న మార్పులు చేస్తే ఏ వయసు వారికైనా అది పనికి వచ్చేలా రూపొందించాడు. పాపలు పడుకోవటానికి, జోగాడేటపుడు ఊగటానికి, పెద్ద అయిన తర్వాత ఆడుకోవటానికి ఇలా వివిధ రకాలుగా పనికి వచ్చేలా ఒకే ఊయలను రూపొందించాడు. రెండు ఇనుప పట్టాల వంటి వాటిపైన బేరింగుల సహాయంతో ఎటువంటి కుదుపులు లేకుండా సున్నితంగా పని చేసేలా రూపొందించాడు. పెద్దవాళ్ళు కూడా సరదాగా కూర్చుని ఊగటానికి కూడా దీన్ని వాడుకోవచ్చు.

బరువైన బల్లలో వాటిని వేలాడదీసే పెద్ద గొలుసులు లేకుండా, 40 కిలోల బరువుండే ఈ ఊయల ఖరీదు కేవలం 4 వేల రూపాయలు.



అన్ని వయసుల వారికి పనికి వచ్చే తేలికైన, చవకైన ఊయలను రూపొం దించిన సపన్ కుమార్ మండల్ కు ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవే షన్ల మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సా హక పురస్కారంతో సత్కరిం చారు.

## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

### పశువుల పేడను సేకరించే పరికరం

**పేరు: మోహన్ ముక్తాజీ లంబ్**

**నివాసి : బీడ్, మహారాష్ట్ర**



మహారాష్ట్ర లోని బీడ్ జిల్లాకు చెందిన 45 సంవత్సరాల 'మోహన్ ముక్తాజీ లంబ్' కేవలం 10వ తరగతి వరకే చదివినప్పటికీ సాంకేతిక విషయాలు, టెక్నాలజీ యంత్రాలపై ఇతనికి మక్కువ ఎక్కువ. తనచుట్టూ వుండే వ్యవసాయదారుల సమస్యలను గమనించి, వాటికి పరిష్కారంగా అనేక చిన్న పరికరాలను తయారు చేసి ఇస్తూ వుంటాడు. ఇంతకు ముందు 2013లో ఎన్.ఐ.ఎఫ్. వారు నిర్వహించిన 7వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్ల పోటీలలో భుజాలపై తీసుకు వెళ్ళ గలిగే స్ప్రేయర్ కనిపెట్టినందుకు గాను బహుమతి అందుకున్నాడు.

ఒకసారి మోహన్ ఒక డైరీ ఫాం సందర్శించినపుడు అక్కడ పనిచేసే వారు చేతితో పేడను సేకరించటానికి మొహమాట పడటం గమనించాడు. డైరీఫాం యజమానితో మాట్లాడుతూ వుండగా, ఆయన తను చాలా సంవత్సరాలుగా పేడ ఎత్తడానికి మనుషులు దొరకక, చాలా ఇబ్బంది పడుతున్నాను అన్నాడు. ఒకవేళ దొరికినా, ఆ పని చేయడానికి హెచ్చు కూలీ అడుగుతున్నారని తెలిపాడు. ఈ సమస్య తెలుసుకున్న మోహన్ చేతులతో పేడ తీయవలసిన అవసరం లేకుండా, పేడను ఎత్తే పరికరం రూపొందించాలని నిర్ణయించుకున్నాడు.

అనేక ఆలోచనలు, ప్రయోగాలు చేసి, 2015లో ఒక నమూనా యంత్రాన్ని రూపొందించాడు. దాన్ని వాడుతూ ఉండగా ఎదురైన సమస్యలను పరిష్కరించటానికి చిన్న చిన్న మార్పులు చేస్తూ, పూర్తి స్థాయి యంత్రాన్ని 2018లో రూపొందించాడు. ఈ యంత్రంలో 0.5 హార్స్‌పవర్‌ల సామర్థ్యం గల డి.సి. మోటారు, బ్యాటరీ, పేడ ఎత్తడానికి, మరోచోటకు తీసుకు వెళ్ళటానికి ట్రేలు, చక్రాలు మొదలైన భాగాలు ఉంటాయి. ఈ యంత్రాన్ని కరెంటు సహాయంతో కూడా నడుపుకోవచ్చు. 45 సెం.మీ.వెడల్పు వున్న ఈ యంత్రం నిమిషానికి 8 కిలోల పేడను సేకరించ గలదు. బ్యాటరీతో కలిపి దీని ఖరీదు 12 వేల రూపాయల వరకు వుంటుంది.

డైరీ ఫారాలలో కూలీల ఖర్చు తగ్గించే ఈ అద్భుతమైన యంత్రాన్ని రూపొందించిన మోహన్ ముక్తాజీకి ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.



## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

### ఎక్కడికైనా తీసుకు వెళ్ళగలిగే గదిని వెచ్చ చేసే యంత్రం

**పేరు: తౌసీఫ్ ఆలి మాలిక్**

**నివాసి : కిస్తీవార్, జమ్ము & కాశ్మీర్**



జమ్ము & కాశ్మీర్ లోని కిస్తీవార్ ప్రాంతానికి చెందిన 25 సంవత్సరాల 'తౌసీఫ్ ఆలి' డిగ్రీ వరకు చదివినా, చేసేది రోజువారి కూలి. అయినా తన చుట్టు ప్రక్కల ఉండే సమస్యలను గమనిస్తూ వాటికి తనకు తోచిన పరిష్కారాలు అందించడం అలవాటుగా చేసుకున్నాడు.

అతి శీతల వాతావరణంతో వుండే కాశ్మీర్ ప్రాంతంలో ప్రతి ఇంట్లో కూడా గదిని వెచ్చగా ఉంచుకోవడానికి 'బుఖారీ' అనే సాంప్రదాయ కుంపట్లను వాడుతూ ఉంటారు. ఇవి రకరకాల సైజులలో, రూపాలలో వచ్చినా వీటి పనితనంలో మార్పు ఉండక పోవటం గమనించాడు తౌసీఫ్. ఈ బుఖారీలు అనేవి రేకులతో చేసిన సిలిండర్ లాంటి డబ్బాలుగా ఉండి, మధ్యలో వున్న ఒక గొట్టం ద్వారా పొగ పోయే ఏర్పాటు ఉంటుంది. సాధారణంగా ఇవి ఒక గంట సేపు పని చేయాలి అంటే 3 నుంచి 4 కిలోల కలప కాల్చడానికి ఉపయోగించాల్సి వుంటుంది.

తౌసీఫ్ తాను రూపొందించిన 'బుఖారీ'లో వేడి ఎక్కువ సేపు నిలువ ఉండటం కోసం మట్టితో తాపడం చేశాడు. దీనితో గంటకి కేవలం ఒక కిలో బొగ్గు లేదా కలప మాత్రమే అవసరం అవుతాయి. వేడి కూడా ఎక్కువ సేపు ఉంటుంది. తౌసీఫ్ ఈ పరికరంలో చేసిన చిన్న మార్పు వలన ఎన్నో కుటుంబాలలో బొగ్గు, కలప ఖర్చు తగ్గి పర్యావరణానికి కూడా మేలు చేసే విధంగా ఉంది.

చలినుంచి తట్టుకోవడానికి తన చిన్న ఉపాయంతో మంచి పరిష్కారం చూపించిన కాశ్మీర్‌కు చెందిన 'తౌసీఫ్ అలీ' కి ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు. ●

సుభాష్, ఫోన్ :



# ఆయుర్వేద జ్ఞాన మథనం



- 'వైద్య' ఉమా మహేశ్వర రావు

## ఎన్నో ఔషధ గుణాలు గల మొక్క 'ధవణం' :

ప్రకృతి మనకు ఇచ్చిన దివ్య ఔషధాలు పళ్ళు, కూరగాయలు, గింజలు, సుగంధ ద్రవ్యాలు, మొక్కలు ఎన్నో ఉన్నాయి. అందులో 'ధవణం' అనే సుగంధ ద్రవ్య మొక్క ఒకటి దీన్నే కొన్ని ప్రాంతాల్లో 'మాసుపత్రి' అని కూడా పిలుస్తుంటారు. దీన్ని మహిళలు జడలో పెట్టుకునే పూలతో కలిపి దండ కట్టుకుంటూ ఉంటారు. దీని గింజలతో కొంతమంది 'సలాడ్' చేసుకుని ఆహారంగా తీసుకుంటారు. వీటి లేత ఆకులను అన్నంలో వేసుకుని ఉడికించి తీసుకున్నట్లయితే అన్నం కూడా సువాసనగా ఉంటుంది. ఈ ఆకుతో ఇంట్లో పొగ పెట్టుకున్నట్లయితే ఇంట్లో దోమలు ఉండవు, ఇల్లంతా సువాసనతో 'అత్తరు' (పర్ఫ్యూం) వేసినట్టు ఉంటుంది. ఈ ధవణంతో తయారు చేయబడిన తైలం కూడా మార్కెట్లో లభిస్తుంది. ఈ తైలాన్ని శరీరానికి పైపూతగా వాడినట్లయితే ఎన్నో రకాల చర్మ రోగాలను నయం చేస్తుంది. శరీరంపైన వున్న పొక్కులు, దురదలు, మచ్చలు లాంటివి అన్నీ తగ్గిపోతాయి. కొందరు మహిళలు ప్రసవం అయిన తర్వాత వారి పొట్టపైన చారలు లాంటి ఏర్పడి చాలామంది ఇబ్బంది పడుతుంటారు. అటువంటి వారు ఈ తైలాన్ని పొట్టపైన పూసుకున్నట్లయితే ఈ చారలు తగ్గిపోతాయి. ఋతుక్రమం సరియైన సమయంలో జరగని మహిళలు కూడా ఈ తైలాన్ని పొట్టపైన రాసుకున్నట్లయితే ఋతుక్రమం సరైన సమయంలో అవుతుంది.

మోకాళ్ళ నొప్పులు వున్నవాళ్ళు మోకాలిపైన పూసుకున్నా మంచి గుణం కనపడుతుంది. విపరీతమైన టెన్షన్ తో బాధపడుతున్న వారు ఈ తైలాన్ని తలకు మర్దనా చేసుకున్నట్లయితే టెన్షన్ తగ్గిపోతుంది. ఈ తైలాన్ని వేడి నీటిలో రెండు మూడు చుక్కలు వేసుకుని ఆవిరి పట్టుకున్నట్లయితే గాలి ఆడక పోవటం, ముక్కు దిబ్బడ, ముక్కులు డిబ్బి వేసుకున్నట్లు ఉన్న వారికి త్వరగా ఉపశమనం కలుగుతుంది. దీన్ని పైన చెప్పిన వాటిలో ఏ విధంగా వాడినా శరీరం అలసట తీరినట్లు అయి, ఉత్సాహంగా తమ పనులు చేసుకోవచ్చు. ఎన్నో రకాల ఔషధ గుణాలతో పాటు, మంచి సువాసనను వెదజల్లే ఈ మొక్కను ప్రతి వారు తమ ఇళ్ళల్లో పూల కుండీలలో పెంచుకోవచ్చు. ప్రకృతి మనకు వృక్ష సంపద రూపంలో ప్రసాదించిన దివ్యమైన బహుమానాల్లో ఈ ధవణం ఒకటి.

## కూరగాయల వల్ల కలిగే లాభాలు :

**ఆర కాకరకాయ :** మనకు లభించే కూరగాయలలో కూడా ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. వాటిలో 'ఆర కాకరకాయ' లో చాలా ఔషధ గుణాలున్నాయి. మనకు సోకే ఏ రోగాలైనా 'వాత, పిత్త, కఫ' అనే త్రిదోషాల వల్లనే కలుగుతాయి. ఆర కాకరకాయ కూర కాస్త చేదుగా, వగరుగా అనిపించినా దీన్ని అప్పుడప్పుడూ తీసుకున్నట్లయితే శరీరాన్ని సమశీతోష్ణ దశలో వుంచి, పైన చెప్పిన వాత పిత్త, కఫాలను అదుపులో వుంచి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ కూర కళ్ళకు చాలా మంచిది, మొలల వ్యాధి వున్న వారికి కూడా ఇది అదుపులో వుంచుతుంది. దేహ పుష్టి కలిగించి, తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం ఆర కాకర కాయ. ఒత్తిళ్ళు, గొంతు సమస్యలకు కూడా చాలా మంచి మందు.

ఈ కాయలను చెట్టు నుంచి తెంపిన తర్వాత ముక్కలుగా చేసి, నువ్వుల నూనెలో వేయించి, ఎండలో ఉంచి ఎండిన తర్వాత తీసిపెట్టుకొని ఎప్పుడైనా ఆహారంగా వినియోగించుకోవచ్చు. వీటిని వేయించిన నూనెను శరీరానికి పూసుకున్నట్లయితే చిన్న చిన్న కురుపులు, మచ్చలు లాంటి వాటిని నివారించటంతో పాటు, శరీరానికి కూడా చాలా మంచిది.

**అనప (సొర) కాయ :** అనపకాయ మొక్క ఆకుల రసాన్ని తీసి కాలిన గాయాలపై రాసినట్లయితే ఎంతో మేలు చేస్తుంది. సాధారణంగా కాలిన గాయలకు వచ్చే నీటితో కూడిన బొబ్బర్లు రాకుండా నివారిస్తుంది, చీము పట్టనీయదు. ఈ ఆకులను దంచి రసం తీసి కొద్దిగా నీటిలో వేసి, వేడి చేసి, కషాయం చేసుకుని సేవించినట్లయితే రక్త హీనతను తగ్గిస్తుంది. అనప కాయ కూరలో శరీరానికి చలువ చేసే గుణం వుంటుంది కాబట్టి శీత పైత్యాన్ని పోగొడుతుంది. అయితే అనప కాయకు వాతం చేసే గుణం కూడా ఉంది కాబట్టి ఎక్కువ మోతాదులో తీసుకోకుండా, తక్కువ మోతాదులో ఆహారంగా తీసుకున్నట్లయితే శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. అనపకాయ విత్తనాలు ఎండిన తర్వాత వాటిలోని పప్పును సేకరించి తీసుకున్నట్లయితే మధుమేహ వ్యాధి ఎక్కువ, తక్కువ కాకుండా నియంత్రణ వుంచే అద్భుతమైన ఔషధంగా పని చేస్తుంది, వీర్య వృద్ధి కూడా కలుగుతుంది.

అనప (సొర) కాయలు మూడు రకాలు మొదటిది తెల్లది, రెండవది ఆకుపచ్చది, మూడవది గుండ్రంగా ఉండేది. వీటిలో ఆకుపచ్చ కాయలు బాగా శ్రేష్ఠమైనవి.

**కంద గడ్డ :** కందగడ్డను కూరగా చేసుకుని తీసుకున్నట్లయితే మొలల వ్యాధి వున్నవారికి ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. వాత, పిత్త, కఫ గుణాలను కూడా అదుపులో వుంచి, కడుపులో వున్న ఎన్నో క్రిములను నిర్మూలించ గలిగే గుణమున్న దుంప ఈ కందగడ్డ. వీటిని తెంచిన వెంటనే వాడితే కాస్త దురద పెట్టే గుణం వుంటుంది కాబట్టి చెట్టు నుంచి తెంపిన తర్వాత కొన్ని రోజులు ఉంచి పాతబడ్డాక వాడితే మంచిది. అంత త్వరగా ఎండేది కాదు కాబట్టి ఎప్పుడైనా వాడుకోవచ్చు.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం. : 94402 86854

**కడుపులో గ్యాస్ట్రిక్ సమస్య నివారణకు చిట్కా:**

ఒక్కోసారి మనం తీసుకునే ఆహారం వల్ల కడుపులో గ్యాస్ ఏర్పడి చాలా బాధిస్తుంది. కడుపు ఉబ్బరంగా ఉండటం, గుండెలు పట్టేసినట్టు ఉండటం జరుగుతూ ఉంటుంది. ఒక్కోసారి గుండె ఆగినంత పనైపోతుంది. అటువంటప్పుడు సాధారణంగా మార్కెట్‌లో లభించే 'ఇనో' పౌడర్ తెచ్చుకుని నీటిలో కలుపుకుని త్రాగుతూ ఉంటారు. లేదా 'జెలిసిల్' అనే టానిక్ కొంత నోట్లో వేసుకుంటూ వుంటారు. ఈ సమస్య కొందరికి అదేపనిగా వస్తూ వుంటుంది. అటువంటి వారు ఈ గ్యాస్ నివారణకు ఒక చిన్న చిట్కా ఉపయోగిస్తే వెంటనే తగ్గిపోతుంది.

ఒక చిన్న అల్లం ముక్కను తీసుకుని దాన్ని శుభ్రంగా నీటితో కడిగి, మెత్తటి బట్టతో తుడుచుకున్న తర్వాత, 5-10 వరకు చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని ఉంచుకోవాలి లేదా కొద్దిగా రోట్లో వేసుకుని దంచినా ఫర్వాలేదు. మిక్సీలో వేసి మాత్రం మెత్తగా చేసుకోవద్దు. తరువాత సైంధవ లవణం (రాతి ఉప్పు) కొద్దిగా తీసుకుని దాన్ని మెత్తటి పొడిగా చేసుకుని ఉంచుకోవాలి. ఒక అర స్పూను సైంధవ లవణం పొడిని చేతిలో వేసుకుని అందులో చిన్న ముక్కలుగా చేసుకున్న అల్లం ముక్కలను సైంధవ లవణం పొడిలో వేసి కలిపి ఒక్కో ముక్కను నోట్లో వేసుకుని బాగా నమిలి మింగాలి. ఇలా చేస్తే కేవలం 5 నిమిషాల లోపే బాగా త్రేపులు వచ్చి పొట్టలో వున్న గ్యాస్ మొత్తం త్రేపుల రూపంలో, మల ద్వారం ద్వారా (పిత్తుల రూపంలో) బయటికి పోతుంది.

ఈ చిట్కాను కొన్ని రోజుల పాటు క్రమం తప్పకుండా వాడినట్లయితే గ్యాస్ ట్రబుల్ అనేది దరి చేరకుండా కూడా ఉంటుంది. అయితే ఈ చిట్కాను భోజనానికి అరగంట ముందు లేదా భోజనం చేసిన అరగంట తర్వాత మాత్రమే చెయ్యాలి. ఎందుకంటే భోజనం చేసిన వెంటనే తీసుకున్నట్లయితే వాంతికి అయ్యే అవకాశం ఉంటుంది.

**వెక్కిళ్ళు ఆగిపోవటానికి చిట్కా:**

కొందరికి అదేపనిగా వెక్కిళ్ళు వస్తూ వుంటాయి. వాటిని ఆపటానికి నీళ్ళు త్రాగుతూ ఉంటాము. అయినా కూడా కొందరికి వెక్కిళ్ళు ఆగవు. అటువంటి వారు 'పుదీనా' ఆకులు రెండింటిని తీసుకుని, నీటితో శుభ్రంగా కడిగి, నోట్లో వేసుకుని నమిలి మింగినట్లయితే వెక్కిళ్ళు క్షణాల్లో ఆగిపోతాయి.

**మోకాళ్ళు, కీళ్ళ నొప్పుల నివారణకు చిట్కా:**

చాలా మందికి మోకాళ్ళు, కీళ్ళ నొప్పులు ఎక్కువగా అవుతూ ఉంటాయి. ఈ చలికాలంలో ఆ నొప్పులు ఇంకా బాధిస్తూ ఉంటాయి. ఈ నొప్పుల నివారణకు 4-5 వెల్లుల్లి రెబ్బలను తీసుకుని రోట్లో వేసి మెత్తగా దంచుకోవాలి. మిక్సీలో వేసి మెత్తగా రుబ్బుకోవద్దు. ఎందుకంటే మిక్సీలో వెయ్యటం వల్ల దాన్ని మెత్తగా రుబ్బే సమయంలో మిక్సీలో వేడి పుట్టి అందులోని ఔషధ గుణాలు హరించుకుపోయే అవకాశం



వుంటుంది కాబట్టి రోట్లో వేసి లేదా ఒక గుండ్రాయితో మెత్తగా దంచిన ముద్దను సిద్ధంగా ఉంచుకుని, ఒక టీ స్పూను ఆముదం తీసుకుని పెనంపైన వేసి, పొయ్యిమీద పెట్టి వేడి చెయ్యాలి. ఆముదం వేడెక్కిన తర్వాత అందులో ముందుగా దంచి ఉంచుకున్న వెల్లుల్లి ముద్దను అందులో వేసి, ఒక నిమిషం పాటు అలాగే వేడిగా ఉంచినట్టు అయితే వెల్లుల్లిలోని రసం మొత్తం ఆముదం లోకి ఇముడ్చుకుంటుంది. కొద్దిగా చల్లారిన తర్వాత ఆముదంతో కలిసిన వెల్లుల్లి ముద్దను మోకాళ్ళు, కీళ్ళ నొప్పులు, వాతం నొప్పులు ఉన్నచోట పూసి, దానిపైన ఒక తమలపాకు ఉంచి, మెత్తటి గుడ్డను మూడు మడతలుగా చేసి కట్టు కట్టుకున్నట్లయితే త్వరగా ఈ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.



'వైద్య' వెంకటేశ్వర రావు (జాజి)

**చర్మంపైన పుట్టే అనవసరపు గడ్డల నివారణకు చిట్కా:**

కొందరికి శరీరంపైన, చేతులపైన అక్కడక్కడా గడ్డలు పుడుతూ వుంటాయి. అవి ఏమీ నొప్పి చెయ్యవు కానీ, ఎందుకో ఇలా అవుతుంది అని బాధపడుతూ వుంటారు. అసుపత్రులకు వెళ్తే ఆపరేషన్ చేసి తీసివేయాలి అంటారు.

ఈ గడ్డల నివారణకు కూడా జిల్లేడు ఆకును తీసుకుని శుభ్రంగా కడిగి, మెత్తటి గుడ్డతో సున్నితంగా తుడిచి, ఆకుపైన వేడి చేసిన ఆముదం పూయాలి. ఆ తర్వాత ఆకును గడ్డ వున్నచోట దానిపైన ఆకును బోర్లించి మెత్తటి గుడ్డతో కట్టు కట్టాలి. ఇలా రెండు మూడు రోజుల పాటు చేసినట్లయితే ఆ గడ్డలు పగిలిపోతాయి.

ఈ గడ్డల నివారణకు మరో వైద్య చిట్కా కూడా ఉంది. ఇంటి చుట్టు ప్రక్కల ప్రదేశాల్లో 'తుత్తిరి బెండ' అనే మొక్క వుంటుంది. దీన్నే కొన్ని ప్రాంతాల్లో 'అతి బల' అని, 'దువ్వేన చెట్టు' అని, 'గాంధారి చెట్టు' అని, గౌరం చెట్టు అని పిలుస్తుంటారు. వీటి ఆకులు తీసుకుని నెయ్యి లేదా ఆముదంలో వేడి చేసిన ఆకును గడ్డలపై వుంచి కట్టు కట్టాలి. రాత్రిపూట కట్టు కట్టుకుని ఉదయమే దాన్ని తీసేసి మళ్ళీ కొత్త ఆకును వేసి కట్టు కట్టాలి. ఇలా మూడు రోజుల పాటు చేసినట్లయితే గడ్డలు నివారించ బడతాయి.

ఈ శరీరంపైన ఏర్పడిన గడ్డల నివారణకు మరో చిట్కా కూడా ఉంది. దాదాపు ప్రతి గ్రామంలో 'జువ్వి చెట్టు' ఉండే వుంటుంది. ఆ జువ్వి చెట్టు కొమ్మను తెంపినట్లయితే ఆ కొమ్మనుండి పాలు కారుతాయి. ఆ పాలను ఒక తమలపాకు పైన వేసి, ఆకును గడ్డలపైన బోర్లించి పెట్టి కట్టు కట్టినట్లయితే ఈ గడ్డలు పగిలిపోయి, ఆ బాధ నుండి ఉపశమనం పొందవచ్చు. ఈ పద్ధతిని కూడా మూడు రోజుల పాటు కట్టు మారుస్తూ వైద్యం చేసుకోవాల్సి వుంటుంది. ఈ కట్టు రాత్రిపూట కట్టుకోవటం ఉదయాన్నే తీసివేయటం, మళ్ళీ రాత్రి కట్టు కట్టుకోవటం ఉదయం తీసివేయటం ఇలా మూడు రోజుల పాటు తప్పకుండా చెయ్యాలి.

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**'వైద్య' వెంకటేశ్వర రావు (జాజి) ఫోన్ నెం.: 9908411700**

ఎడిటర్ గారికి,

'పల్లెసృజన' బృందం నుండి సేకరించిన 'సుల్కానియా సజ్జ' రకం నేను జులై 30, 2021న విత్తనం వేయటం జరిగింది. విత్తనం వేసినప్పటి నుండి ఈ రోజు (ఆగస్టు 24, 2021) వరకు వర్షం పడలేదు. అయినా నా సజ్జ కంకులు 28 సెంటీమీటర్ల పొడవు వచ్చాయి. ఇంత మంచి రకం సజ్జ విత్తనాలను అందించినందుకు 'పల్లెసృజన' బృందానికి కృతజ్ఞతలు. అద్భుతాలు సృష్టిస్తోంది 'పల్లెసృజన' అని నా పొలం చూసిన ఎంతోమంది రైతులు అంటున్నారు.

**– చంద్రశేఖర్ (9494939655), రామలింగాయపల్లె, తుగ్గలి మండలం, కర్నూలు జిల్లా.**

ఎడిటర్ గారికి,

'పల్లెసృజన' అందించిన 'సుల్కానియా సజ్జ' రకం 1 ఎకరాలో, కంది నేను 5 ఎకరాలు, మా తోటి రైతు 3 ఎకరాలు విత్తటం జరిగింది. కేవలం ఒకటిన్నర మాసాల్లోనే నా పొలంలో సజ్జ కంకి 26 అంగుళాళ పొడవు వచ్చింది. మా గ్రామంలోని రైతులు ఈ పొలాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇంత పొడవైన కంకి వచ్చే విత్తనం ఎక్కడినుంచి తెప్పించావు అని అడుగుతున్నారు. నేను 'పల్లెసృజన' ద్వారా కంది, సజ్జ విత్తనాలు తెప్పించానని ఆనందంగా చెపుతున్నాను. వచ్చే సంవత్సరం మాకు ఈ విత్తనాలు ఇవ్వండి అని అడుగుతున్నారు. ఇంత మంచి విత్తనాలను అందించినందుకు ధన్యవాదములు.

**– విజయ భాస్కర రెడ్డి (9966742464), పులకుర్తి గ్రామం, కోడుమూరు మండలం, కర్నూలు జిల్లా.**

**చంద్రశేఖర్ గారూ, విజయ భాస్కర రెడ్డి గారు,**

**మీ అభిమానానికి కృతజ్ఞతలు. 'పల్లెసృజన' బృందం 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.)' ద్వారా సేకరించి మన తెలుగు రాష్ట్రాల రైతాంగానికి అందించి, ఎక్కువ దిగుబడులు సాధించటానికి మావంతు సహకారం అందించడం వల్ల అందరు రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేయటం మాకెంతో సంతోషాన్ని, మరిన్ని అధిక దిగుబడులు సాధించే మన రైతులు రూపొందించిన విత్తనాలను అందించటానికి ముందుకు సాగేలా చేస్తోంది. ఈ విత్తనాలను పరిచయం చెయ్యటం వల్ల రైతులకు మంచి జరుగుతోంది అని మీ వల్ల మాకు తెలుస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. ధన్యవాదములు. – ఎడిటర్.**

ఎడిటర్ గారికి,

మేము ఎన్నో సంవత్సరాలుగా రకరకాల పంటలు వేస్తున్నాం, నష్టపోతున్నాం. ఇటీవలి కాలంలో మా అనంతపురం జిల్లాలో పండ్ల తోటలు విపరీతంగా పెట్టడం వల్లనేమో గత మూడు సంవత్సరాలుగా వర్షాలు బాగా కురుస్తున్నాయి. వాతావరణం కూడా దాదాపు మాకు సమీపంలోని మదన పల్లి లాగా మారటం మేము గమనించాము. నేను 10 ఎకరాల దానిమ్మ తోట వేసి, వాటి వైరస్‌లను తట్టుకోలేక, మార్కెటింగ్ సరిగ్గా లేక తీసివేయటం జరిగింది. చీని తోట వేద్దామా, మా జిల్లాలో ఇప్పటికే చాలా వున్నాయి. జామ వేద్దామంటే వాటికి అస్సలు రేటు లేకుండా పోయింది. ఏం చేద్దామని అనుకుంటున్న తరుణంలో 'పల్లెసృజన' సరఫరా చేస్తున్న హెచ్ఆర్ఎంఎన్–99 రకం ఆపిల్ చెట్లను గురించి మా మిత్రుని ద్వారా తెలుసుకుని ఎంతో సంతోషించాను. ఏదైనా కొత్త రకం పంట వేస్తే కనీసం కొన్ని సంవత్సరాల వరకు మార్కెటింగ్ ఇబ్బంది లేకుండా వుంటుందని మా భావన. మీ ద్వారా కంది, సజ్జ లాంటి ఎన్నో ఎక్కువ దిగుబడులు సాధించే పంటలను మా రైతులకు అందిస్తున్నందుకు ధన్యవాదములు. మరిన్ని అధిక దిగుబడులను ఇచ్చే కొత్తరకం పంటలను మా రైతులకు అందించ గలిగితే మీకు సదా కృతజ్ఞులమై వుంటాము.

**– రాజశేఖర రెడ్డి, కదిరి, అనంతపురం జిల్లా.**

**రాజశేఖర రెడ్డి గారు,**

**'పల్లెసృజన' శోధయాత్రల పేరుతో గ్రామాలను సందర్శించి వారి సాధక బాధకాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటునే వుంది. అందువల్లనే నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ద్వారా వెలుగులోకి వచ్చిన వివిధ రకాల పంటలను ప్రతి సంవత్సరం ఒకటి రెండు మన తెలుగు రైతాంగానికి పరిచయం చేస్తూ వున్నాము. మేము ఇంత వరకు 'రిచా–2000' కంది, 'సుల్కానియా' సజ్జ, 'శ్రీరాం' నువ్వులు, హెచ్ఆర్ఎంఎన్ ఆపిల్, 'సదాబహార్' మామిడి పంటలను అందించడం జరిగింది. వాటిని విత్తుకున్న రైతులందరి సంతోషాన్ని చూసి మాకింకా ఉత్సాహం కలుగుతోంది. అందుకే రైతులు అభివృద్ధి చేసిన అధిక దిగుబడులను ఇచ్చే**

విత్తనాలు, మొక్కలు పరిచయం చెయ్యటంతో పాటు, పెట్టుబడి ఖర్చు తగ్గించే వ్యవసాయ పరికరాలు, సేంద్రియ పురుగు మందులను కూడా అందించటం మాకెంతో సంతోషదాయకం. మీ ప్రోత్సాహంతో ఇంకా ముందుకు సాగుతామని నమ్ముతున్నాం.

**– ఎడిటర్.**

ఎడిటర్ గారికి,

'పల్లెసృజన' మరుగున పడివున్న ఇన్నోవేటర్‌లను గురించి ఏమీ ఆశించకుండా ప్రపంచానికి తెలియజేస్తున్నది. ఇది అద్భుతమైన విషయం. రైతులకు, ప్రజలకు ఉపయోగ పడే చౌకయిన యంత్రాలను గురించి తెలియజేస్తుంది మరియు మరుగున పడిన ఆయుర్వేద చిట్కాలు తెలియజేస్తుంది. తక్కువ ఖరీదులో అన్ని విషయాలు కవర్ చేస్తూ సంపూర్ణంగా అందిస్తున్న గొప్ప పత్రిక. అలాగే 'పల్లెసృజన' "యూ ట్యూబ్ ఛానల్" కూడా ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత చేరువ అవుతుందని ఆశిస్తున్నాను.

**– శేషగిరి రావు, విశాఖపట్నం.**

'పల్లెసృజన'లో ఎడిటోరియల్ ఫాంట్ ప్రత్యేకంగా ఉంటే బావుంటుందని నా అభిప్రాయం. ఇన్నోవేటర్లను, వారి ఇన్నోవేషన్లను గురించి వివరించే తీరు చాలా బాగుంది, పత్రిక కలర్‌లో ఉంటే ఇంకా నిండుదనం చేకూరుతుందని, అలాగే 'యూ ట్యూబ్ ఛానల్'ను కూడా ప్రారంభిస్తారని ఆశిస్తున్నాము. **– చింతకాయల రాంబాబు, విజయవాడ.**

**ఎడిటర్ గారికి,**

మా సోదరునికి వెన్నెముకలో ఎల్–4, ఎల్–5 డిస్క్‌లకు సర్జరీ చేయించడం జరిగింది. వెన్నులో నొప్పి ఎన్ని రకాల ఆయింట్ మెంట్‌లు వాడినా తగ్గలేదు. మిత్రుల సలహాతో 'పల్లెసృజన' వారి "శ్రీశైలం" వాడిన కొద్ది రోజులకే నొప్పి అంతా తగ్గిపోయింది. ఇప్పుడు మా సోదరుడు సులభంగా లేస్తున్నాడు, నడవ గలుగుతున్నాడు. శ్రీశైలం లాంటి మంచి మందును అందించినందుకు ధన్యవాదములు. **– రంగారావు, హైదరాబాద్.**

## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA)***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,**<br>Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post,<br>Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post,<br>Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017 **Signature of Publisher**

పల్లెసృజన

అమ్మకానికి సిద్ధంగా వున్న
రైతుల కోసం రైతుల

# ఇన్నోవేషన్లు

## HRMN-99 ఆపిల్ మొక్కలు

మొక్కల ప్రత్యేకత **40–48** డిగ్రీల వాతావరణంలో కూడా అనుకూలంగా పెరుగుతున్నాయి. మీకు సరఫరా చేయబడే మొక్క కేవలం ఒక కొమ్మ, దానికి వేర్లు కలిగి ఉంటుంది. ఈ మొక్క నాటిన **10–15** రోజుల్లోనే చిగురిస్తుంది. మొక్క పెరిగిన రెండవ ఏడాదికి పూలు, మూడవ ఏడాది నుండి పండ్లు కాస్తుంది. **6**వ సంవత్సరం నుండి పరిపూర్ణంగా పండ్లు కాస్తుంది. ఈ ఆపిల్ పండ్లు తినడానికి రుచిగా ఉంటాయి. ఈ మొక్క నాటే కాలము డిసెంబర్, జనవరి నెలలు బాగా అనుకూలము. ఇది చలికాలంలో మంచుతో మాగా ఎదుగుతుంది. ఇవి అంటు మొక్కలు కావున మొక్క నాటే ముందు తల్లిమొక్క యొక్క అంటు భాగం భూమికి రెండు అంగుళాలు పైన అందేలా నాటుకోవాలి. ముందుగా బుక్ చేసుకున్న వారికి మాత్రమే మొక్కలు అందజేయ బడతాయి.

గత సంవత్సరం 'పల్లెసృజన' ద్వారా సరఫరా చేయబడ్డ దాదాపు 4 వేల మొక్కలు **90–95** శాతం వరకు చిగురు వేసి బాగా ఎదుగుతున్నవి. నాటిన అందరు రైతులూ మొక్కలు బాగా ఎదుగుతున్నందుకు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇది చాలా మొండి మొక్క. ఒక్క సంవత్సరం ఈ మొక్కను బ్రతికించుకో గలిగితే చాలు మొక్క బాగా ఎదుగుతుంది. గత సంవత్సరం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రైతులు నాటిన మొక్కలను కూడా క్రింద పరిశీలించ గలరు.



2020 డిశంబర్ మాసంలో మన తెలుగు రాష్ట్రాల్లో నాటిన కొందరు రైతుల ఆపిల్ మొక్కలు



మొక్కలు సరఫరా చేసే ముందు ఇలా ఉంటాయి



3 సం.ల తర్వాత కాపు ఇలా ...



6 సం.ల తర్వాత కాపు ఇలా ...


మొక్కలు కావలసిన వారు సంప్రదించండి :

బి. సుభాష్ చందర్, ఫోన్ : 9652801700; వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 79890 38186 / 81257 99904

PALLE SRUJANA Telugu Bi-monthly September - October 2021 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక
రూ. 30/-లు
మాత్రమే



పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

PhonePe

"Phone Pe"
no 9866 00 1678

QR code for Phone Pe

లేదా

'గూగుల్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

### సభ్యత్వ వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- | 1,000/- |